ఈనాడు ప్రకాశం
శనివారం 28 సెప్టెంబరు 2024 5

నాడు పంచాయతీ కార్యదర్శి... నేడు డిప్యూటీ కలెక్టర్

● నూతన ఆర్డీవో లక్ష్మీప్రసన్న స్ఫూర్తిదాయక పయనమిది



ఒంగోలు ఆర్డీవోగా కంబాలకుంట లక్ష్మీప్రసన్న నియమితుల య్యారు. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పట్టు దలగా గ్రూప్స్ ఛేదించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. త్వరలో శిక్షణ పూర్తిచేసుకుని ఇక్కడ విధుల్లో చేరనున్నారు. అన్నమయ్య జిల్లా నందలూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న... స్థానిక జడ్పీ ఉన్నత పాఠ శాలలో పదో తరగతి, తిరుపతిలోని చైతన్య జూనియర్ కళా శాలలో ఇంటర్, రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళా శాలలో బీటెక్ పూర్తిచేశారు. అనంతరం పంచాయతీ కార్యద ర్శిగా ఎంపికై టీవీపురంలో విధులు నిర్వహించారు. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంలో దిల్లీలో శిక్షణ తీసుకున్నారు. 2018లో నిర్వహించిన గ్రూప్-1లో మెయిన్స్‌కు అర్హత సాధించినా త్రుటిలో అవకాశం చేజారింది. నిరాశను దరిచేరనీయకుండా.. . లోటుపాట్లను సరిచేసు కుంటూ మరింత పట్టుదలగా గమ్యం వైపు అడుగులు వేశారు. 2023లో నిర్వహించిన గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధిం చారు. ప్రస్తుతం మంగళగిరిలోని హెచ్ ఆర్‌డీఏలో శిక్షణ పొందుతున్నారు. అక్టోబర్ 4తో అది పూర్తికానుంది. ఆమె భర్త చంద్రదీప్ అనంతపురం జిల్లాలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

30 మంది ఈవోఆర్డీలకు స్థానచలనం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 30 మండలాలకు చెందిన ఈవోఆర్డీలను బదిలీ చేశారు. ప్రస్తుతం జరు గుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా వారందరూ దరఖాస్తు చేసు కున్నారు. వారు కోరుకున్న మండలాలకు బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి డీపీవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. త్వరలో వీరంతా విధుల్లో చేరనున్నారు.

సీమాక్ సిబ్బందికి కౌన్సెలింగ్: ఒంగోలు నగరం: గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన సీమాక్ కేంద్రాలను తొలగిం చిన నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న 23 మంది సిబ్బందిని నేష నల్ హెల్త్ మిషన్ పరిధిలోని కేంద్రాలకు బదిలీ చేశారు. ఇందు కోసం డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ శుక్రవారం తన కార్యా లయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 23 మంది స్టాఫ్ నర్సులు, ఓ ల్యాబ్ టెక్నీషియన్, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ ఒకర్ని ఇతర కేంద్రాలకు బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు.

వైకాపా తప్పిదం... సరిదిద్దే యత్నం


◗ నేటి నుంచి 'మన ఇల్లు... మన గౌరవం'
◗ జిల్లావ్యాప్తంగా గృహ లబ్ధిదారులకు సదస్సులు

వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం... గత వైకాపా సర్కారు చేసిన తప్పిదాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది. పేదలందరికీ ఇళ్లంటూ జగనన్న లే అవుట్ల పేరిట అప్పట్లో హడావుడి చేసి... వసతుల పేరిట రూ.కోట్లు ఖర్చు చేసినా అసలు లక్ష్యం నెరవేరలేదు. పలు కాలనీల్లో అసలు పనులే ప్రారంభం కాలేదు. చాలా నిర్మాణాలు వివిధ స్థాయిలో అసంపూర్తిగా ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా వీటిని పూర్తి చేయాలన్న లక్ష్యంతో... 'మన ఇల్లు - మన గౌరవం' పేరిట శనివారం నుంచి సరికొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో అన్ని లే అవుట్ల వద్ద లబ్ధిదారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తోంది. అవసరమైన తోడ్పాటు అందించి సొంతింటి కల సాకారం చేసుకునేలా ప్రోత్సహించనుంది.

–న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం


ఊళ్లన్నారు... ఇళ్లే లేవు!

ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ ఊదరగొట్టిన గత వైకాపా ప్రభుత్వం... లేఅవుట్లకు భూసేకరణ నుంచే అక్రమాలకు పాల్పడింది. మెరక తోలడం, చదును చేయడం వంటి పనులను అస్మదీయులకు కట్టబెట్టింది. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగమయ్యాయి. చాలాచోట్ల కనీస పనులు చేపట్టకుండానే నాయకులు బిల్లులు చేసుకున్నారు. పలు చోట్ల వాస్తవ విలువ కంటే మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ధరకు భూములు సేకరించి అవకతవకలకు పాల్పడ్డారు. ఇంత చేసినా ఊరికి దూరంగా, నివాసానికి అనువుగా లేని ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడంతో చాలా మంది నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. పనులు చేపట్టకపోతే పట్టాలు రద్దు చేస్తామన్న హెచ్చరికలతో కొందరు పనులు మొదలు పెట్టినా తరువాత వదిలేశారు. ఈ వ్యవహారం భవిష్యత్తులో కేంద్రం నుంచి వచ్చే ఇళ్ల కేటాయింపులు, నిధులు మంజూరుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మార్చిలోగా ఆయా నిర్మాణాలు పూర్తి చేయించే లక్ష్యంతో లబ్ధిదారుల చెంతకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది.



ఏప్రిల్ నుంచి పీఎంఏవై 2.0

కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్ నుంచి పీఎంఏవై 2.0 కార్యక్రమం అమలు చేయనుంది. పీఎంఏవై 1.0 కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మళ్లీ కేటాయించే అవకాశం లేదు. ఉన్న స్థలంలోనే పనులు చేపట్టాలి. గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయకుంటే బిల్లు వచ్చే అవకాశం లేదు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు వివరించి చెప్పడంతో పాటు... పనులు పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం లేఅవుట్ల వారీగా ప్రత్యేకాధికారులను నియమించారు. ఆయా సదస్సులకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు సైతం హాజరుకానున్నారు.



● మొత్తం నిర్మాణాల్లో 32 శాతం పూర్తయినట్లు దస్త్రాల్లో చూపినా... క్షేత్రస్థాయిలో ఇరవై శాతమూ పూర్తికాలేదని అంచనా.



పొదిలి మండలం తలమల్లలో నిర్మాణాలు లేక చిట్టడవిని తలపిస్తున్న జగనన్న కాలనీ

ఆ సిబ్బంది రూటే సెపరేటు!

● వెలిగొండ కార్యాలయంలో ఇష్టారాజ్యం
● అధికారుల ఆదేశాలూ బేఖాతర్



న్యూస్‌టుడే – పెద్దారవీడు

వెలిగొండ కార్యాలయంలోని కొందరు దిగువస్థాయి సిబ్బంది తీరు తరచూ వివాదాస్పదమవుతోంది. రెండు దశాబ్దాలుగా ఇక్కడే పాతుకుపోయి... రాజకీయ అండదండలతో ఉన్నతాధికారులనే బెదిరించే స్థాయికి చేరారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గత అయిదేళ్లుగా వైకాపా నాయకులతో అంటకాగిన పలువురు ఉద్యోగులు... వారి ప్రాపకం కోసం అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాయకుల అండతో...: మార్కాపురం మండలం రాయవరం సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఇరవై ఏళ్లుగా పలువురు సిబ్బంది కొనసాగుతున్నారు. కొందరు నాయకులు వీరిని మచ్చిక చేసుకుని... మద్యం సీసాలు వంటివి నజరానాగా ఇస్తూ అడ్డగోలు పనులు చేయించుకుంటున్నారు. వారి అండ చూసుకుని సదరు సిబ్బంది అధికారుల మాట వినడం లేదు. ఉన్నత స్థాయిలో వచ్చిన ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఎవరైనా గట్టిగా వ్యవహరిస్తే దస్త్రాలు మాయం చేసి... అప్పటికే ఉన్న సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. కొన్నిసార్లు ఏకవచనంతోనూ సంబోధిస్తూ అవమానించేలా వ్యవహరిస్తున్నారు. గతంలో పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సైతం ఇక్కడ విధులు నిర్వర్తించలేక ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం వచ్చే నిర్వాసితులతోనూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. అడిగినంత మొత్తం ఇవ్వకపోతే కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇక్కడ చోటు చేసుకుంటున్న వ్యవహారాలు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది.

> ☛ ఓ నిర్వాసితుడి కుమారుడి వయసు పెంచి లబ్ధిదారుల జాబితాలో చోటు కల్పిస్తానని... ఓ వైకాపా నాయకుడు నమ్మించి కొంత మొత్తం వసూలు చేశాడు. కార్యాలయంలో అనుయాయుడైన సిబ్బందికి కొంత వాటా ఇచ్చి ఆ పని అప్పగించాడు. రోజులు గడుస్తున్నా పని కాకపోవడంతో సదరు బాధితుడు గురువారం కార్యాలయానికి వచ్చి నిలదీయడంతో గందరగోళం తలెత్తింది. మిగతా సిబ్బంది సర్ది చెప్పి వివాదం పెద్దది కాకుండా జాగ్రత్తపడ్డారు.

పర్యాటకం అభివృద్ధికి పెద్దపీట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేడుకలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కొత్తపట్నం, పాకల బీచ్‌లు; భైరవకోన, గుండ్ల బ్రహ్మేశ్వరం, నల్లమల తుమ్మలబయలు; గుండ్లకమ్మ, రామతీర్థం జలాశయాలు; సింగరాయకొండ, త్రిపురాంతకం, మార్కాపురం ఆలయాలకు చారిత్రక నేపథ్యంతో పాటు, పర్యాటకంగానూ విశేష ప్రాధాన్యముందన్నారు. ప్రభుత్వం సైతం పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించి... ఈ రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని వివరించారు. తద్వారా ఉపాధి అవకాశాలూ మెరుగుపడనున్నాయని తెలిపారు. విద్యార్థులు సైతం పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలుసుకోవాలన్నారు. రోజూ దినపత్రిక చదివే అలవాటు చేసుకోవాలని... తద్వారా సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలుసుకొనే వీలుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి బెనహర్, ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో సైమన్ విక్టర్, నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌సా, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఏకేవీకే ప్రధానాచార్యులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా





పంటలు కాపాడేందుకు పాలేరు వాగులో వేసిన బోర్లు



తర్లుపాడు-మార్కాపురం రోడ్డులో చెరువును తలపిస్తున్న పొలాలు

పశ్చిమంలో మునక... తూర్పులో పడక!

రెండు రోజుల క్రితం పశ్చిమ ప్రకాశంలో కురిసిన భారీ వర్షాలకు... మార్కాపురం, పొదిలి, తర్లుపాడు తదితర ప్రాంతాల్లోని పొలాలు నీట మునిగాయి. పత్తి, వరి, మొక్కజొన్న తదితర పైర్లను కాపాడుకొనేందుకు... చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు కర్షకులు అవస్థలు పడుతున్నారు. ఇదే సమయంలో తూర్పు ప్రకాశంలో తగినంత వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పంటలు కాపాడుకొనేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. పొన్నలూరు మండలానికి చెందిన కొందరు కర్షకులు రావులకొల్లు సమీపంలోని పాలేరు వాగు గర్భంలో బోర్లు వేసి తడులు అందిస్తున్నారు. అక్కడున్న బావి నీటినీ మోటార్ల ద్వారా తరలిస్తున్నారు.

ఈనాడు, ఒంగోలు



జమ్మనపల్లెలో వరద నీటిని బయటకు పంపుతున్న రైతు


ఎమ్మెల్యేలకు ఎస్కార్ట్ సేవలొద్దు!

● జిల్లా పోలీసు బాస్ ఆదేశం
● రాజకీయ వర్గాల్లో చర్చ

'ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని కేటాయించాం. వారి రక్షణ బాధ్యతను వారు చూసుకుంటారు. ప్రత్యేకంగా ఎస్కార్ట్ సేవలు అవసరం లేదు. అందరూ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉండండి. ఎక్కడైనా ఎమ్మెల్యేల పర్యటనలు ఉంటే బందోబస్తుకు సిబ్బందిని పంపండి. అంతకుమించి వ్యవహరిస్తే సహించేది లేద'ని జిల్లా ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పుడీ వ్యవహారం జిల్లా రాజకీయ, పోలీసువర్గాల్లో చర్చనీయాంశమైంది.

–న్యూస్‌టుడే – ఒంగోలు

జగన్ హయాంలో ఊడిగం...



గత వైకాపా ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని అడ్డగోలుగా వాడుకుంది. అధికారం, హోదా స్థాయీ బేధాలతో సంబంధం లేకుండా నిబంధనలు పక్కన పెట్టి పోలీసులతో ఊడిగం చేయించుకుంది. వాస్తవానికి ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కాన్వాయ్, హానర్ ఆఫ్ గార్డ్ సౌకర్యం ఉంటుంది. అందుకు భిన్నంగా ఎమ్మెల్యేలకు సైతం కాన్వాయ్‌లు ఏర్పాటు చేశారు. వారి వాహనాలకు అగ్రభాగాన సైరన్ మోగిస్తూ ఊరేగించారు. అధికారిక హోదాలోని పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు సైతం మంత్రి స్థాయిలో సిబ్బందిని కేటాయించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గ పర్యటనల్లో ఉంటే మరి చెప్పనవసరం లేదు. మొత్తం పోలీసు యంత్రాంగం వారి సేవలోనే తరించేది. స్టేషన్‌లో ఎస్సై సహా పదిమంది సిబ్బంది ఉంటే... ఎస్‌హెచ్‌వోతో పాటు మూడొంతుల సిబ్బంది వారి సేవకే వెళ్లేవారు. చివరకు సీఐలతో పాటు డీఎస్పీలు సైతం తమ విధుల్ని పక్కనపెట్టి పడిగాపులు కాసేవారు. స్థాయిలేని వారికీ పైలెట్ నిర్వహించేవారు.


అప్పట్లో ప్రజల పడిగాపులు...

పోలీసు యంత్రాంగమంతా వైకాపా నాయకుల సేవకే పరిమితం కావడంతో... వివిధ సమస్యలతో స్టేషన్లకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. అధికారుల రాకకోసం స్టేషన్ల వద్ద పడిగాపులు కాసేవారు. అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో పోలీసుల వ్యవహార శైలిపై ప్రజల్లో తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తమైంది. ఈ అనుభవాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దామోదర్ ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు ఎస్కార్ట్ చేయొద్దని... నియమావళి మేరకే విధులు నిర్వర్తించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఎస్పీ నిర్ణయం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. కొందరు ప్రజాప్రతినిధులు ఈ విషయమై గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

ఉచిత ఇసుక... మరింత సులభతరం

● జిల్లాలోని 260 ప్రాంతాల్లో నిల్వల గుర్తింపు
● పారదర్శకతకు పెద్దపీట వేస్తూ మార్గదర్శకాలు

ఈనాడు - ఒంగోలు



> 'పేదలకు ఉచితంగా ఇసుక ఇస్తున్నాం. సొంత అవసరాలకు సమీపంలోని రీచ్‌ల నుంచి ఎద్దుల బండి, ట్రాక్టర్‌తో తీసుకెళ్లొచ్చు. ఎవరైనా అడ్డుకుంటే ఫిర్యాదు చేయండి. భూగర్భ జలాలకు ముప్పు తలెత్తకుండా తవ్వకాలు చేయండి. అధికారులు సైతం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలి' ...
>
> **ఈ నెల 20న మద్దిరాలపాడులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన భరోసా ఇది.**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేస్తూ కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలు సిద్ధం చేసింది. ఎక్కడా పేదలు ఇబ్బంది పడకుండా... పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నిబంధనలు రూపొందించింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఉన్న వరకు పంపిణీ చేసి...

జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఇచ్చిన హామీ మేరకు జులై 8న ఉచిత ఇసుక పంపిణీకి శ్రీకారం చుట్టింది. అప్పటి వరకు స్టాక్ పాయింట్లలో ఉన్న నిల్వలను... తవ్వకం, సీనరేజీ ఛార్జీలు మాత్రమే వసూలు చేసి టన్ను రూ.247 చొప్పున పంపిణీ చేసింది. అలా... జరుగుమల్లిలోని రెండు, ఒంగోలులోని మరో స్టాక్ పాయింట్లలో ఉన్న 43 వేల టన్నులను అందజేసింది. ఇతర ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు లేకపోవడం, జిల్లాలోని రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఇదే అదునుగా గతంలో ఇసుక అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు దందాకు తెర లేపారు. టన్ను రూ.900 నుంచి రూ.1200 చొప్పున విక్రయిస్తూ... దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.9 వేల వరకు వసూలు చేయడం ప్రారంభించారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో... ఇసుక విధానాన్ని మరింత సరళతరం చేస్తూ కొత్త మార్గదర్శకాలు సిద్ధం చేసింది.

ఎక్కడి నుంచైనా తెచ్చుకోవచ్చు...

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఇరవై మండలాల పరిధిలో 260 గ్రామాల్లోని నదులు, వాగులు, వంకల్లో ఇసుక నిల్వలను జలవనరులు, గనులశాఖ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తమ సొంత అవసరాలకు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల అనుమతితో తీసుకెళ్లేలా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. ఇసుక నిల్వలు లేని మండలాల వారు సమీపంలోని స్టాక్‌పాయింట్ల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏ సమయంలోనైనా, ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. నాణ్యత లేదని భావిస్తే పొరుగు జిల్లాల నుంచీ తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. దీనివల్ల పేదలకు ఉచితంగా ఇసుక లభించడంతో పాటు... మొత్తం ప్రక్రియలో పారదర్శకత పెరిగి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు.



జేవీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల దేవాదాయశాఖకు చెందిన ఆలయాల ఆభరణాలు తనిఖీ అధికారి (జేవీవో)గా డి.శ్రీనివాసరావు శుక్రవారం కొత్తపేటలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గుంటూరు జిల్లా దేవాదాయశాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008లో సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా, ఒంగోలు జిల్లా సహాయ కమిషనర్‌గా, తెనాలి వైకుంఠపురం దేవస్థానం లాంటి తదితర ఆలయాల్లో ఈవోగా పనిచేశారు. చివరగా లాలాపేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను జేవీవోగా జరిగిన బదిలీలో గుంటూరు జోన్ జేవీవోగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆ శాఖ ఈవోలు, మేనేజర్లు, సిబ్బంది జేవీవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జడ్పీ సీఈవోగా చిరంజీవి..

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజా పరిషత్ సీఈవోగా బి.చిరంజీవి స్థానిక దక్షిణ బైపాస్‌లోని జడ్పీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా జడ్పీ ఉప సీఈవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ప్రకాశం సీఈవోగా నియమితులయ్యారు. ఆయన్ను ఉప సీఈవో సీహెచ్. హనుమంతరావుతోపాటు, జడ్పీ ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తొలుత స్థానిక ప్రకాశం భవన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

డ్వామా పీడీగా జోసఫ్‌కుమార్..

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డ్వామా పీడీగా జి.జోసఫ్‌కుమార్ ఒంగోలులోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా డ్వామా పీడీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ప్రకాశానికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన పీడీకు కార్యాలయ ఉద్యోగులు, జిల్లాలోని ఏపీవోలు, ఏపీడీలు కలిశారు. తొలుత కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలెక్టరేట్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపీ మాగుంటకు అభినందనలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఆయనకు సిఫార్సు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తోడ్పాటు అందించిన జిల్లాలోని ఎమ్మెల్యేలు, తెదేపా నాయకులు, కార్యకర్తలకు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

మూత్రగండంతో యాతన
పింఛనివ్వక వంచన





❖ పీసీపల్లి మండలం ముద్దపాడు చెందిన ముద్దా కృపారావుకు యుక్త వయస్సులోనే మూత్రపిండాలు పాడవ్వగా.. డయాలసిస్ చేయించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పింఛన్ కోసం గత వైకాపా ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు మంజూరు కాలేదు. ఎప్పుడూ అధికారులను అడిగినా సైట్ ఓపెన్ కాలేదని తప్పించుకుంటున్నారు.



❖ పీసీపల్లి మండలం చినవరిమడుగు గ్రామానికి చెందిన మోతుకూరి కొండమ్మ వారంలో రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. గతేడాది పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు మంజూరు కాలేదు. మందులు, ఇతరత్రా ఖర్చులకు కలిపి ప్రతి నెల రూ. పదివేలకు పైగా ఖర్చవుతోందని ఆమె వాపోతున్నారు.

న్యూస్‌టుడే, కనిగిరి :

కనిగిరి అంటే గుర్తుకొచ్చేది ఫ్లోరైడ్, మూత్రపిండ బాధితులే. వాటి బారిన పడి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆ విష కౌగిలికిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు గత తెదేపా ప్రభుత్వం ఫించన్‌కు శ్రీకారం చుట్టింది. అయితే గత వైకాపా ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని నీరుగార్చింది. బాధితుల దరఖాస్తులను పట్టించుకోకపోవడంతో చాలామంది పింఛన్ అందక ఇప్పటికీ అష్టకష్టాలు పడుతున్నారు. వారానికి రెండు మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవడానికి, మందులు కొనుక్కోవడానికి నెలకు రూ.వేలు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ గత పాలకుల నిర్వాకంతో అవస్థలు



డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

గతేడాదిగా అందడం లేదు..

కిడ్నీ వ్యాధి బారిన పడి వారు ఏ పని చేయలేరు. ఆ రోగులు డయాలసిస్‌తో పాటు మందులకు నెలకు సుమారు రూ. 25వేల వరకు ఖర్చు అవుతుంటుంది. అలాంటి వారికి ప్రభుత్వం నెలకు రూ. 10 వేల పింఛన్ అందిస్తోంది. కానీ నేటికీ చాలామందికి రావడం లేదు. కనిగిరి దయాలసిస్ సెంటర్ పరిధిలో మొత్తం 124 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరిలో 90మంది రూ. 10వేల చొప్పున పింఛన్ తీసుకుంటున్నారు. మరో 34 మంది గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఎవరికి మంజూరు కాలేదు. చేతిలో చిల్లి గవ్వలేక ఇబ్బందులు పడుతూ బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పింఛను రాని వారి పరిస్థితి ఇలా ఉంటే.. మరికొంత మంది ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సరిపోక ఇబ్బంది పడుతున్నారు. నగదు మొత్తం పెంచాలని రోగులు కోరుతున్నారు.

త్వరలో మంజూరు

కనిగిరి పరిశోధన కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న వారిలో 34 మందికి పింఛను రావడం లేదు. గతేడాది దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. తిరిగి దరఖాస్తు చేశాం. త్వరలో అందరికీ వస్తాయి.
– డా.అబ్దుల్ కలాం, సామాజిక వైద్యశాల సూపరింటెండెంట్, కనిగిరి

టెట్ నిర్వహణకు కేంద్రాల ఎంపిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహణ కోసం జిల్లాలో నాలుగు కేంద్రాలు ఎంపిక చేసినట్లు డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు. అక్టోబర్ మూడు నుంచి 21 వరకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులోని కృష్ణ చైతన్య విద్యాసంస్థ, మార్కాపురం మండలం దరిమడుగులోని శామ్యూల్ జార్జి కళాశాల, ఒంగోలు మామిడిపాలెం వద్ద గల నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి విద్యాసంస్థ, నగరంలోని నెల్లూరు బస్టాండ్ సమీపంలోగల బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయానికి గంటన్నర ముందుగా రావాలన్నారు. దివ్యాంగులు ఎవరికైనా సహాయకుడు కావాల్సి ఉంటే డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రెండు చేతులు లేనివారు, అంధులకు యాభై నిమిషాలు అదనపు సమయం కేటాయిస్తారన్నారు. హాల్ టికెట్టుపై నో ఫొటోగ్రాఫ్ అని ఉన్న అభ్యర్థులు తాజా ఫొటో, సరైన గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావచ్చన్నారు. నామినల్ రోల్స్‌లో పేర్లు సరిదిద్దుకునేందుకు టెట్ కేంద్రాల్లోని డిపార్ట్‌మెంట్ అధికారిని సంప్రదించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుందని, పరీక్ష సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే తెలియజేయవచ్చన్నారు. ఏదైనా సమస్య ఉంటే అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్ 812526 4606కు సంప్రదించాలన్నారు. డీఈవో కార్యాలయంలో టెట్ గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామన్నారు.

29న డీఎస్సీ అభ్యర్థులకు నమూనా పరీక్ష

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డైఫీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 29న ఉదయం పది గంటలకు డీఎస్సీ అభ్యర్థులకు టెట్ నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు డైఫీ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు తెలిపారు. ఒంగోలుతోపాటు, దర్శి, పొదిలి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, సింగరాయకొండ, కంభం మండల కేంద్రాల్లో కూడా అదే రోజు పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్షకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు డి.వెంకటరెడ్డి, టి.రాజశేఖర్, కేవీ.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో అపచారంపై మౌనదీక్ష



విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాలం సుబ్బారావు

దర్శి, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీతో కలత చెందిన స్వామి భక్తుడు, దర్శికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాలం సుబ్బారావు మౌన దీక్ష చేపట్టారు. ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా 80 సంత్సరాల వయస్సులో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు దీక్ష చేపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుమలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరుతున్నారు.

ఆధునిక చికిత్సలతో మెరుగైన సేవలు



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల, అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వైద్యరంగంలో ఆధునిక చికిత్సా విధానాలతో మరిన్ని మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. శుక్రవారం నగరంలోని ఎంఎస్ కల్యాణ మండపంలో ఓరల్ ఫేషియల్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ సదస్సు వల్ల దంత వైద్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శి నామినేని కిరణ్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత నగరంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. 220 మంది దంత వైద్యులు హాజరుకాగా, వివిధ నగరాల నుంచి 8 మంది నిపుణులు వచ్చారు. అసోసియేషన్ జాతీయ కమిటీ కోశాధికారి జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. దంత పరికరాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

కలవని మనసులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనసేన పార్టీలో కొత్తగా చేరిన నాయకులను కలిసి అభినందనలు తెలిపే అంశంలోనూ నేతలు అన్యమనస్కంగా వ్యవహరించారు. గురువారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్త కంది రవిశంకర్ పార్టీలో చేరారు. వారిని మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపేందుకు వెళ్లడంలో పార్టీ నాయకులు ఎవరికి వారే యమునా తీరే చందంగా సాగారు. పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ మహిళా నాయకులు, కార్యకర్తలతో కలసి కంది రవిశంకర్ వద్దకు వెళ్లి అభినందించారు. నగర పార్టీ అధ్యక్షుడు, 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్, నగర కమిటీ సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి వద్దకు, తరువాత కంది రవిశంకర్ వద్దకు వెళ్లి కలవడం చర్చనీయాంశమైంది. పార్టీలో మూడు గ్రూపులు ఏర్పడ్డాయనే ప్రచారం జరుగుతోంది.



రవిప్రియ మాల్ అధినేత రవిశంకర్‌ను కలసిన జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, జనసేన వీర మహిళలు

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

క్షుద్ర పూజల కలకలం

బేస్తవారపేట: బేస్తవారపేట పంచాయతీ పాపాయిపల్లెలోని ఓ ఇంటి వద్ద క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఇంటి ముందు మెట్ల వద్ద గురువారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించి కుంకుమ, పసుపు, నిమ్మకాయలతో పాటు రక్షా రేకు మీద ఆ ఇంటిలోని మహిళ పేరు రాసి ఉంచి వెళ్లడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India

కందుకూరు మెయిన్ బ్రాంచ్ (03041), వెంగమాంబ కళ్యాణ మండలం ఎదురుగా, పామూరు రోడ్డు, కందుకూరు-523105. ఫోన్ నెం.91599 16991, ఇ-మెయిల్ : ubin0803049@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

వీరి నుండి
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు మెయిన్ బ్రాంచ్, కందుకూరు తరఫున
SARFAESI యాక్ట్ 54 ఆఫ్ 2002 క్రింద
దిగువ వారికి

విషయము : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెల్లించవలసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సెక్యూర్డ్ క్రెడిటార్ మీరు బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం **దిగువ తెలిపిన తేదీలలో** డిమాండ్ నోటీసును జారీ చేసినారు. నిర్దేశించిన సమయంలో, నిర్ణీత వ్యవధిలో మీరు నోటీసులో పేర్కొన్న బకాయిని చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6 / 8తో చదివే చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం స్థిరాస్తులను **దిగువ తెలిపిన తేదీలలో** లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. కావున ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులను విక్రయించడం కొరకు ఇ-వేలం నిర్వహించాల్సిన సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, మీరు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు బ్యాంక్‌కు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకం పై తదుపరి చర్యలు తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ ఆస్తిని విడిపించుకోవచ్చు.

ఋణగ్రహీతలు/ సహ-పూచీదారులు/ హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

1) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి బోద యాసర్, భర్త. మనోహర్,** డి.నెం.22-3-46, నాంచారమ్మ కాలనీ, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 23.05.2024 **స్వాధీనత తేది : 03.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఎ1, బ్లాకు నెం.సి2, 704 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 22 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మూడవ అంతస్థులోని 430 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.టి5 **శ్రీమతి బోద యాసర్, భర్త. మనోహర్ గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్తి. **ఫ్లాటు నెం.టి5 నకు హద్దులు : తూర్పు** : కారిడార్, **దక్షిణం** : ఓపెన్ స్పేస్ & రోడ్డు, **పడమర** : సి1 బ్లాకు, **ఉత్తరం** : ఫ్లాట్ నెం.6.

2) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి ముంగమూరి సౌజన్య, భర్త. కాలేబు,** 19-1-262/1, పడమటి వడ్డి పాలెం, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 10.05.2024 **స్వాధీనత తేది : 02.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఎ1, బ్లాకు నెం.సి4, 704 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 22 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మూడవ అంతస్థులోని 430 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.టి5 **శ్రీమతి ముంగమూరి సౌజన్య, భర్త. కాలేబు గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్తి. **ఫ్లాటు నెం.టి5 నకు హద్దులు : తూర్పు** : కారిడార్, **దక్షిణం** : ఓపెన్ స్పేస్ & రోడ్డు, **పడమర** : సి3 బ్లాక్, **ఉత్తరం** : ఫ్లాట్ నెం.6.

3) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి షేక్ పర్వీన్ సుల్తానా బేగం, భర్త. మహబూబ్ బాషా,** 11-1-66/11, సంతోష్ నగర్, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 23.05.2024 **స్వాధీనత తేది : 03.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఎ1, బ్లాకు నెం.సి2, 704 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 22 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మూడవ అంతస్థులోని 430 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.టి2 **శ్రీమతి షేక్ పర్వీన్ సుల్తానా బేగం, భర్త. మహబూబ్ బాషా గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్తి. **ఫ్లాటు నెం.టి2 నకు హద్దులు : తూర్పు** : సి3 బ్లాకు, **దక్షిణం** : ఓపెన్ స్పేస్, **పడమర** : కారిడార్, **ఉత్తరం** : ఫ్లాటు నెం.1.

4) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి షేక్ హుస్సేన్ బీ, భర్త. సిద్ధయ్య,** 6-2-36, పోతురాజుమిట్ట, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 03.06.2024 **స్వాధీనత తేది : 03.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఎ1, బ్లాకు నెం.బి12, 608 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 19 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మొదటి అంతస్తులోని 365 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.జి5 **శ్రీమతి షేక్ హుస్సేన్ బీ, భర్త. సిద్ధయ్య గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్తి. **ఫ్లాటు నెం.జి5 నకు హద్దులు : తూర్పు** : కారిడార్, **దక్షిణం** : ఫ్లాటు నెం.6, **పడమర** : రోడ్డు, **ఉత్తరం** : బ్లాక్ ఎ17.

5) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి షేక్ బీబీ జాన్, భర్త. రసూల్ బాషా,** 7-3-14/ఎ, ఖాజీపాలెం, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : 10.05.2024 **స్వాధీనత తేది : 02.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఎ1, బ్లాకు నెం.బి14, 608 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 19 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో రెండవ అంతస్థులోని 365 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.యస్6 **శ్రీమతి షేక్ బీబీ జాన్, భర్త. రసూల్ బాషా గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్తి. **ఫ్లాటు నెం.యస్6 నకు హద్దులు : తూర్పు** : కారిడార్, **దక్షిణం** : మెట్లు, **పడమర** : బ్లాకు బి13, **ఉత్తరం** : ఫ్లాటు నెం.5.

తేది : 27.09.2024, స్థలం : కందుకూరు సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

❖ పూసలపాడులో విశ్రాంత ఉద్యోగి.. ❖ తోకపల్లితో తాత మృతి..మనుమడికి గాయాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: జిల్లాలో వేర్వేరుచోట్ల చోటుచేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు కంభం పట్టణంలోని భాగ్యనగర్ మూడో లైన్‌కు చెందిన విశ్రాంత సైనికోద్యోగి మేడం రమణయ్య స్కూటీపై గిద్దలూరు నుంచి స్వగ్రామానికి వస్తుండగా పూసలపాడు సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న స్థానిక విశ్రాంత సైనికోద్యోగి ఉదయగిరి బాలయ్యను (66) ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బాలయ్య తలకు తీవ్ర గాయాలు కాగా రమణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. బాలయ్యను మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నారాయణరెడ్డి తెలిపారు.



చికిత్స పొందుతున్న షోయబ్

పెద్దారవీడు, న్యూస్‌టుడే: బంధువుల అంత్యక్రియలకు వెళ్తూ..రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తోకపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..దోర్నాలకు చెందిన షేక్ మాబు(65) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వియ్యంకుడు, మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్.కె కాశింసాహెబ్ (58), ఆరో తరగతి చదువుతున్న మనుమడు మహ్మద్ షోయబ్‌ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని మాబు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు దోర్నాలకు బయలుదేరారు. మార్గంమధ్యలో ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాశింసాహెబ్‌కు బలమైన గాయాలు కాగా షోయబ్ తలకు, చేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కాశింసాహెబ్ మృతి చెందారు. అనారోగ్యంతో ఒకరు, రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

గాయపడిన అసిస్టెంట్ లైన్‌మెన్ ..

బేస్తవారపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యుత్తు ఉద్యోగి శుక్రవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు..బేస్తవారపేటలోని విద్యుత్తుశాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చిన్న కంభానికి చెందిన బచ్చలకూరి అశోక్‌కుమార్ (33) ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై స్నేహితులైన రాజశేఖర్, రవితో కలిసి పాపాయిపల్లెకి వెళుతున్నారు. స్థానిక మేరీ ప్రార్థనా మందిరం వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని జేసీ అగ్రహారానికి చెందిన షేక్ రసూల్ ఆటో ఢీకొంది. దీంతో అశోక్‌కుమార్, రాజశేఖర్, రవికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స అనంతరం మూడు రోజుల కిందటే బేస్తవారపేటలోని అంబేడ్కర్ కాలనీలోని ఇంటికి తీసుకురాగా శుక్రవారం అశోక్ మృతి చెందారు. మృతుడికి భార్య మేర్సీ ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



అశోక్‌కుమార్ (33) పాత చిత్రం

దోపిడీ కేసు బాధితురాలు మృతి

ఒంగోలు నేరవిభాగం: ఒంగోలు కాకతీయ నగర్‌లో రెండురోజుల క్రితం జరిగిన దోపిడీ కేసులో బాధితురాలు హఠాన్మరణం చెందారు. స్థానికంగా నివసిస్తున్న పొన్నం సీతారావమ్మ(80) ఇంటిలో రెండురోజుల క్రితం దోపిడీ దొంగలు చొరబడి ఆమెను నిర్బంధించి రూ.లక్ష నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉంది. దోపిడీ ఘటనతో ఆమె షాక్‌కు గురై అస్వస్థతకు లోనయ్యారు. దీంతో కుమార్తె నగరంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా గురువారం రాత్రి ఆమె మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

కనిగిరి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన స్థానిక సూరాపాపిరెడ్డినగర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. ఏఎస్సై భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన వేశపోగు చంటి (33) మద్యం తాగి తరచూ ఇంట్లో వారితో గొడవ పడుతుండేవాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్ ఇనుప రాడ్డుకు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీలు ఢీకొని.. క్యాబిన్‌లో ఇరుక్కుని..

సింగరాయకొండ గ్రామీణం : జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న మరో లారీ ఢీ కొన్న సంఘటనలో ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ సంఘటన శుక్రవారం వేకువ జామున 3 గంటలకు చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..కోల్‌కతా నుంచి బెంగళూరుకు కూరగాయల లోడుతో లారీ చోదకుడు దావూద్ బయలుదేరారు. ఆయన ప్రయాణిస్తున్న వాహనం స్థానిక లారీ యూనియన్ కార్యాలయం సమీపంలో ముందు వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో చోదకుడు తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. అతన్ని బయటకు తీసి హైవే అంబులెన్సు ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం రోడ్డుపై నిలిచిపోయిన లారీని తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.



సింగరాయకొండ గ్రామీణం: చోదకుడిని క్యాబిన్ నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

మేమున్నాం.. మీకు తోడుగా..

మార్కాపురం : 8008631313 గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం: 8008552658 పొదిలి: 8008550360

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే :

సమస్య : రాచర్ల రహదారిలో కొత్త విద్యుత్తు స్తంభాన్ని 20 రోజుల క్రితం ఏర్పాటు చేసిన అధికారులు పాత స్తంభానికి ఉన్న విద్యుత్తు తీగలను కొత్త స్తంభానికి అమర్చకుండా అలాగే వదిలేశారు. శిథిలావస్థకు చేరిన పాత స్తంభం పడిపోయే అవకాశముంది. – **కృష్ణయ్య, స్థానికుడు**

సమాధానం : సిబ్బందిని పంపి తీగలను మార్పించేఏర్పాటు చేసి పాత స్తంభం తొలగించేలా చూస్తాం. – **శేషగిరిరావు, ఏడీఈ, గిద్దలూరు**

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే

? : పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ధరణి అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందిగా ఉంది. కనీసం చెత్త వేసే కంపార్ట్ ఏర్పాటు చేయండి.
– **బి.అల్లూరయ్య, పట్టణవాసి**

✓ : సిబ్బంది పంపి సమస్యను పరిష్కరిస్తాం. – **చెన్నకేశవులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్**

మార్కాపురం, న్యూస్‌టుడే

? : మార్కాపురం మండలంలోని గజ్జలకొండ గ్రామంలో సాగర్ నీరు అన్ని వీధులకు సరఫరా కావడం లేదు. శివారు ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. – **శ్రీను, గజ్జలకొండ**

✓ : పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో ఈ సమస్య వచ్చింది. మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా చేస్తాం.– **జ్యోతి సృజన, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, మార్కాపురం**

కొనకనమిట్ల, న్యూస్‌టుడే

? : మండలంలోని గొట్లగట్టు ఎస్సీ కాలనీలో గృహాలపై విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. చర్యలు తీసుకోండి. – **అశోక్, గొట్లగట్టు**

✓ : పరిశీలించి తీగలను నిర్ణీత ఎత్తులో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– **రామకృష్ణ, విద్యుత్తు ఏఈ కొనకనమిట్ల**

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

? : వై.పాలెం పట్టణంలోని పీర్లచావిడి బజారులోని పరివర్తకం సమస్యవల్ల గృహాలకు లోవోల్టేజీ వస్తోంది. విద్యుత్తు అధికారులకు చెప్పినా స్పందించడం లేదు. చాన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్నాం:
– **గోపిదేశి నారాయణ, స్థానికుడు**

✓ : క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం
– **అల్లూరయ్య, ఏఈ**

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే

? : కేజీ జాతీయ రహదారి-అన్నసముద్రం రహదారి కంకర లేచిపోయి గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
– **వి.నాగేశ్వరావు, అన్నసముద్రం.**

✓ : రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు వేస్తాం. – **పి.మహంకాళయ్య, ఏఈఈ, పీఐయూ విభాగం, యర్రగొండపాలెం**

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:

? : పెద్దదోర్నాలలో సుందరయ్య కాలనీకి ట్యాంకర్ల అందించే నీరు సరిపోవడంలేదు. కాలనీలోని డీప్‌బోరుకు మరమ్మతులు చేయించండి.
– **రాజవర్ధన్, పెద్దదోర్నాల**

✓ : డీప్‌బోరుతో పాటు పైపులైను పరిశీలించి వాటిని మరమ్మతులు చేసి నీరందించేందుకు చర్యలు తీసుకుంటాం– **మోహనరావు, పంచాయతీ కార్యదర్శి, పెద్దదోర్నాల.**

పుల్లలచెరువు, న్యూస్‌టుడే:

? : మండలలోని తెల్లగట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ట్యాప్ వద్ద సాగర్ నీరు వృథాగా పోతుంది. – **ఆవులయ్య, తెల్లగట్ల**

✓ : సిబ్బందిని పంపి నీటి పంపునకు ట్యాపు బిగించి నీటి వృథాను అరికడతాం.
– ఏఈ పి.శ్రీకాంత్

మార్కాపురం

• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

వరద బాధితులకు ఆర్థిక సాయం

మార్కాపురం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రకాశం జిల్లా మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు మార్కాపురం మెడికల్ అసోసియేషన్ నుంచి రూ.65 వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలు మెడికల్ అసోసియేషన్ వారికి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ శ్రీనివాసరావు, యక్కలి బాలు, ప్రసాద్, వేమూరి సుబ్బారావు, సతీష్ పాల్గొన్నారు.



జిల్లా అసోసియేషన్ వారికి నగదును అందజేస్తున్న మార్కాపురం మెడికల్ అసోసియేషన్ సభ్యులు

త్వరలో పరివర్తకాలందిస్తాం

‘న్యూస్‌టుడే’తో మార్కాపురం డివిజనల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.వి.నాగేశ్వరరావు ముఖాముఖి



మార్కాపురం, న్యూస్‌టుడే : రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలోనే విద్యుత్తు పరివర్తకాలు మంజూరు చేస్తున్నట్లు మార్కాపురం డివిజనల్ విద్యుత్తు కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) పి. వి. నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ‘న్యూస్‌టుడే’ ముఖాముఖిలో ఈఈ పలు విషయాలపై మాట్లాడారు.



రైతు భరోసా కేంద్రంలో మోడల్‌గా విద్యుత్తు స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేయిస్తున్న ఏడీఈ సీయానాయక్, సిబ్బంది

ప్రశ్న : రైతుకు 9 గంటల విద్యుత్తు సరఫరా సాధ్యమా?

జవాబు : డివిజన్‌లో వ్యవసాయ సర్వీసులు 80,000. రైతులకు ఒక వారం ఉదయం 7:45 గంటల నుంచి మరో వారం 8:45 గంటల నుంచి 9గంటల విద్యుతు సరఫరా ఇస్తున్నాం. రైతులు రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో పగటి పూట సరఫరా చేస్తున్నాం. విద్యుత్తు ఉప కేంద్రాల్లో అధిక లోడు కారణంగా లోవోల్టేజ్ సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యలను సాంకేతికతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పరివర్తకాల కోసం రైతులు ఎదురుచూపులు తప్పడం లేదు.?

జవాబు : 1080 మంది రైతులు కొత్తగా విద్యుత్తు పరివర్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నెల రోజుల్లోనే సరఫరా చేస్తాం.

ప్రశ్న: పేరుకుపోతున్న బకాయిలను ఎలా వసూలు చేస్తారు?

జవాబు : డివిజన్‌లో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి రూ.10 కోట్లు, పంచాయతీల నుంచి రూ.96 కోట్లు, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలకు సంబంధించి రూ.25 కోట్లు బకాయిలు ఉన్నాయి. సంబంధిత అధికారులతో చర్చించి కొంత వరకు అయినా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కంపెనీల యజమానులతో మాట్లాడి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడానికి కృషి చేస్తున్నాం.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉంది కదా? ఎలా ఇవ్వన్నీ చేయగలరు?

జవాబు : సిబ్బంది కొరత నిజమే. డివిజన్‌లో 12 జేఈలు పోస్టులు, 1 లైన్‌మెన్, 18 ఏజేఎంలు, 6 జేఎల్‌ఎంల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కొరత ఉన్న చోట ఇన్‌ఛార్జిలకు అప్పగించి సమస్యలను పరిష్కరిస్తాం. రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. డివిజన్‌లో ఇంటి సర్వీసులు 1.92 లక్షలు, కమర్షియల్ సర్వీసులు 20 వేలు, పరిశ్రమలు 750, ప్రభుత్వ సర్వీసులు 5532 ఉన్నాయి. ఏదైనా సమస్య వచ్చినా, ఫిర్యాదు అందినా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : విద్యుత్తు చౌర్యం పెరిగిపోతోంది... దీనిపై మీరే చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : డివిజన్‌లో గత ఏడాది వరకు విద్యుత్తు చౌర్యంకు పాల్పడుతున్న 1497 మందిని గుర్తించి వారి సర్వీసులు తొలగించాం. వారికి రూ.2.25 కోట్ల వరకు అపరాధ రుసుం విధించాం. ఇప్పటి వరకు 790 కేసులకు సంబంధించి రూ.90 లక్షల వరకు కట్టించాం. అధికారులు, విజిలెన్స్, ఉన్నత స్థాయి అధికారులు తనిఖీలు చేపట్టి చౌర్యాన్ని అరికట్టే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : స్మార్ట్‌మీటర్ల డివిజన్‌లో ఏర్పాటు చేశారు?

జవాబు : డివిజన్‌లోని 4500 ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. మోడల్‌గా వీటిని ఏర్పాటు చేశాం. పరిశీలించిన తరువాత ఇళ్లకు ఏర్పాటు చేస్తాం. వీటి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

బాధ్యతల స్వీకరణ



పొదిలి సబ్‌రిజిస్ట్రార్‌గా నీరజ



వై.పాలెం సబ్-రిజిస్ట్రార్‌గా షేక్ సుల్తాన్ బాషా



మార్కాపురం పంచాయతీ రాజ్ ఈఈగా శ్రీనివాసులు




కంభం ఎంపీడీవోగా వీరభద్రాచారి

యర్రగొండపాలెం, పొదిలి, మార్కాపురం, కంభం, బేస్తవారపేట, కొనకనమిట్ల: యర్రగొండపాలెం నూతన సబ్-రిజిస్ట్రార్‌గా షేక్ సుల్తాన్ బాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు ఆడిట్ సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా వై.పాలెం వచ్చారు. ❖ పొదిలి సబ్‌రిజిస్ట్రార్‌గా నీరజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కాకుమాను మండలంలో పనిచేస్తూ బదిలీపై పొదిలి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్.ఎన్. వరప్రసాదరావు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌కు బదిలీ అయ్యారు.❖ మార్కాపురం డివిజనల్ పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు (ఈఈ)గా జి.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం జిల్లా నుంచి బదిలీపై మార్కాపురం ఈఈగా వచ్చారు. ❖ మార్కాపురం సహాయ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్‌గా శుక్రవారం డి.బాలయ్య బాధ్యతలు స్వీకరించారు. కృష్ణజిల్లా మైలవరం డీటీఎఫ్ సీఐగా పని చేస్తూ పదోన్నతిపై మార్కాపురంకు బదిలీపై వచ్చారు. ❖ కంభం మండల నూతన ఎంపీడీవోగా టి. వీరభద్రాచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ❖ బేస్తవారపేట మండల నూతన ఎంపీడీవోగా ఆకుల రంగనాయకులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పల్నాడు జిల్లా ఈపూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పార్వతి పల్నాడు జిల్లా అమరావతి మండలానికి బదిలీపై వెళ్లారు.❖ విద్యుత్తు శాఖ పొదిలి డివిజన్ ఏడీఈ గా దాండ్ల హరి బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలులో ఎస్పీఎం ఏడీఈగా పని చేస్తూ బదిలీపై పొదిలి వచ్చారు. ❖ కంభం విద్యుత్తు శాఖ ఏడీగా కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పొదిలిలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ❖ కొనకనమిట్ల వెలుగు డీఆర్‌డీఏ ఏపీఎం సుధాకర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సంతనూతలపాడు బదిలీపై ఇక్కడ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం గోపాలకృష్ణ పొదిలి బదిలీపై వెళ్లారు.



బేస్తవారపేట ఎంపీడీవోగా ఆకుల రంగనాయకులు



కొనకనమిట్ల వెలుగు ఏపీఎంగా సుధాకర్‌రావు



మార్కాపురం సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాలయ్య



పొదిలి డివిజన్ విద్యుత్తు ఏడీఈగా హరిబాబు



కంభం సబ్‌డివిజన్ విద్యుత్తుశాఖ ఏడీగా శ్రీనివాసరెడ్డి



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.అశ్విని కుమార్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా లో భాగంగా పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులతో పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వ్యాధుల కాలంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో మద్యపానం, ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే నష్టాలపై సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ❖ **అర్థవీడు** : స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా బాలుర గురుకులంలో శుక్రవారం చేతుల పరిశుభ్రతపై ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు వంశీకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రదర్శన చేపట్టారు.

పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఐదేళ్లలో గుజరాత్, ఆంధ్ర, ఒడిశాల్లో ఈ రంగంలో 3.7 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా


పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న నివేదితా శుక్లా

ఈనాడు, విశాఖపట్నం: గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో మూడు పెట్రో కెమికల్, పెట్రో ఇండస్ట్రియల్ రీజియన్ (పీసీపీఐఆర్)ల ద్వారా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 3.7 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా వెల్లడించారు. వికసిత్ భారత్‌లో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆ లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటించారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో కేంద్ర ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ఇండియా కెమ్-2024 ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో శుక్రవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో నివేదితా శుక్లా మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడిదారుల స్నేహపూర్వక వాతావరణం కనిపిస్తోంది. ఇక్కడ సువిశాల తీరప్రాంతం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉంది. కొత్త ప్రభుత్వం ఈ ఏడాది రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, 1.3 లక్షల మందికి ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రసాయన, పెట్రో కెమికల్ రంగంలో ఎక్కువ పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చేలా ఇండియా కెమ్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన, పెట్రో కెమికల్ రంగం చాలా కీలకమైంది. ప్రపంచ మార్కెట్‌లో మనం ఆరో స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం రసాయన మార్కెట్ విలువ సుమారు 220 బిలియన్ డాలర్లుగా ఉంది. 2040 నాటికి రూ.లక్ష కోట్ల రూపాయలకు పెరుగుతుంది' అని చెప్పారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఉపాధి అవకాశాల కోసం యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకొచ్చేవారి కోసం నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన వంద పార్కుల్లో మూడు మన రాష్ట్రానికి కేటాయించాలని, వాటిలో ఒకటి ప్రత్యేకంగా కెమికల్ పార్క్ ఉండేలా చూడాలని కోరారు. ఏపీలో పీసీపీఐఆర్ ఉన్నప్పటికీ భారీ పరిశ్రమలేవీ రాలేదని.. దీని గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఇటీవలే మాట్లాడారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 30 పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి దీపాంకర్ అరోన్, గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుదర్శన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.


జగన్‌తో సమావేశమైన జిల్లా నేతలతోపాటు ఉన్న అనంతబాబు (వృత్తంలో)

కలిసికట్టుగా పని చేయండి

వైకాపా నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్

ఈనాడు, అమరావతి: 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం గట్టిగా నిలబడండి.. ఇందుకోసం ఎక్కువ సమయాన్ని కేటాయించండి.. జిల్లాలోని పార్టీ నేతలంతా ఒక కుటుంబంలా, కలిసికట్టుగా పనిచేయాలి' అని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 'ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలు, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల అధ్యక్షులు ఎవరైతే బాగుంటుందని పలువురు నేతలతో చర్చించారు. కాకినాడకు మాజీ మంత్రి కురసాల కన్నబాబును కొనసాగించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికిచెందిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఇటీవలే నియమించినందున... కోనసీమ జిల్లాకు ఎస్సీ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని నేతలు సూచించినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్‌ను కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఖరారుచేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటీవలి ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసి ఓడిన రాపాక వరప్రసాదరావు గైర్హాజరయ్యారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రత్యక్షం: కాకినాడ, కోనసీమ జిల్లాల వైకాపా నేతలతో జగన్ నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవ్వటం చర్చనీయాంశంగా మారింది. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లిన ఆయన ఇప్పుడు బెయిల్‌పై బయట ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇప్పటికీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. కానీ అనంతబాబు మాత్రం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన చాలా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పుడు కూడా క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యక్షమవడం గమనార్హం.

రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం

చెన్నై నౌకాశ్రయంలో పట్టివేత

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయంలో రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి వారు తెలిపిన వివరాల మేరకు... చెన్నై నౌకాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు ఓడలో వెళ్లనున్న కంటెయినర్‌లో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అందులో 112 కిలోల సూడోఎఫెడ్రిన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. దీని రవాణాకు ఉపయోగించిన 2 లగ్జరీ కార్లతో పాటు రూ.3.9 లక్షలు స్వాధీనం చేసుకుని అబుతాహిర్, అహ్మద్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఇదే విధంగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాకు మత్తు పదార్థాలు తరలించారని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన విరమణ

- మంత్రి హామీలకు సానుకూలంగా నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాలను విరమించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లేఖను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్యవిద్యకు కేటాయించిన సీట్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు. సంఘం ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జీఓను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15% బదులు 20% సీట్లను అన్ని స్పెషాలిటీల్లో కేటాయిస్తామని తెలిపారు. సంఘంతో చర్చించిన తర్వాతే ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిని స్వాగతిస్తూ.. సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్, ఇతర వైద్యులు కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17 నుంచి తాము విధుల్లో ఉన్నట్లు పరిగణించి వేతనాలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ట్రైబల్ ఎలవెన్సులు చెల్లించాలని అందులో కోరారు.


ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ అందిస్తున్న వైద్య సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్ తదితరులు

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

అక్కడికి నేనొచ్చినట్లు ఎవరూ చెప్పలేదు

'ఈనాడు' కథనానికి సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ వివరణ

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టయిన రోజున తాను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చినట్లు ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. 'కస్టడీలో రఘురామకు చిత్రహింసలు నిజమే' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఓ ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. "ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు. అదే విషయం టెలికం సంస్థలూ చెప్పాయి. అలాంటిది నా లొకేషన్ ఎలా వచ్చింది? అది అబద్ధం. రఘురామకృష్ణరాజుకు గాయాల్లేవంటూ ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారు. వారు వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని ఒప్పుకొంటే వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుంది. రఘురామకు గాయాలు ఉన్నాయని, కొట్టడంవల్లే అవి అయ్యాయని మిలటరీ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారు, సాక్ష్యం చెప్పరు. అది ఆర్మీ యాక్టు వారికి కల్పించిన రక్షణ" అని సునీల్‌కుమార్ వివరించారు.

మార్చిలో ఇంటి నిర్మాణ సాయం పెంపు: మంత్రి కొలుసు

చాట్రాయి, న్యూస్‌టుడే: అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో త్వరలో స్థలాల కొనుగోలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా మర్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మార్చిలో గృహనిర్మాణ సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎంత పెంచాలనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సొంత స్థలం ఉన్న పేదలు వెంటనే గృహాలు నిర్మించుకునే అవకాశముందని పేర్కొన్నారు.



విజయం దక్కాలంటే..

విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ ఆప్తుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

- 'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు

ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. సీఎంపై భూ ఆక్రమణల నియంత్రణ, అవినీతి నిరోధక, ఫోర్జరీ, బినామీ ఆస్తుల పరిరక్షణ, అధికార దుర్వినియోగం తదితర అభియోగాల కింద పలు సెక్షన్లు పెట్టారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'గోద్రా కేసులో ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ రాజీనామా చేశారా? అక్రమ గనుల తవ్వకాల కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి ప్రధాని రాజీనామా కోరారా?' అంటూ ప్రశ్నించారు. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

రాజీనామా చేయాల్సిన అవసరం లేదు: ఖర్గే


సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరంలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కేసు నమోదు చేయగానే సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటే.. గోద్రా కేసులో మోదీ రాజీనామా చేశారా? అమిత్ షా పైనా కేసులున్నాయి కదా? అని గుర్తు చేశారు. సీబీఐకి సాధారణ సమ్మతి ఉపసంహరణ చర్యనూ ఖర్గే సమర్థించారు.


విలేకర్లతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి


- బాధిత కుటుంబానికి రూ.4 లక్షల ఆర్థికసాయం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పదో వార్డుకు చెందిన షేక్ బీబీజాన్ కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.4 లక్షలు పరిహారం విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో బీబీజాన్ భర్త పెద్ద ఖాశిం హనుమంతునిపాడు మండలం సీతారామపురం (తురకపల్లి) గ్రామంలో వ్యవసాయం చేస్తూ పొలానికి వెళ్లి వస్తూ పిడుగుపడి చనిపోయాడు. మూడేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రభుత్వం కనికరించలేదు. అప్పట్లో 'మూడేళ్లుగా కాళ్లరిగేలా తిరిగినా రైతు కుటుంబాన్ని ఆదుకోని జగన్ ప్రభుత్వం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని మే 2న పొదిలికి ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన అప్పటి ప్రతిపక్షనేత, తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తెదేపా నాయకులు, ఇప్పటి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, నాయకులు సయ్యద్ ఇమాంసాహెబ్, మస్తాన్‌వలిలు తీసుకెళ్లారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత బీబీజాన్ కుటుంబాన్ని ఆదుకుంటామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బీబీజాన్ కుటుంబానికి రూ.4 లక్షలు పరిహారం బ్యాంకులో జమయ్యాయి. రెండు రోజుల క్రితం బ్యాంకు ఖాతా చూసుకుంటే ప్రభుత్వం నుంచి నిధులు అందాయని బీబీజాన్ కుమారుడు మహమ్మద్ రఫి తెలిపారు. తమ కుటుంబాన్ని ఆదుకున్న ముఖ్యమంత్రికి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి, పొదిలిలోని తెదేపా నాయకులకు బీబీజాన్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.


ప్రభుత్వ సాయం అందిందని సంతోషం వ్యక్తం చేస్తున్న బీబీజాన్, కుమారుడు రఫి

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

- కొండెక్కిన ధరలు ● ఆవేదనలో వినియోగదారులు



మార్కాపురం, న్యూస్‌టుడే

పశ్చిమ ప్రకాశంలో ఉల్లిగడ్డలు కొనుగోలు చేయకుండానే కన్నీరు పెట్టిస్తున్నాయి. గతంలో బాగా దిగుబడి తక్కువగా ఉన్న సమయంలో పలికిన ధర నేడు మార్కాపురం మార్కెట్‌లో పలుకుతున్నాయి. మార్కాపురం కూరగాయల మార్కెట్‌లో మొదటి రకం ఉల్లిగడ్డలు కిలో రూ.65 నుంచి రూ.60 వరకు విక్రయం జరుగుతున్నాయి. రెండో రకం ఉల్లిగడ్డలు కిలో రూ.48 నుంచి రూ.55 వరకు విక్రయం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ఉల్లి ధరలు చుక్కలను అంటుతున్నాయి. దిగుబడి తగ్గడంతో ఉల్లి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఎక్కువగా ఉల్లిపాయలను దిగుబడి చేసి ఎగుమతులు చేసే మహారాష్ట్రలో దిగుబడులు తగ్గడంతోనే ఉల్లి ధరలు ఒక్కసారిగా పెరిగినట్లు చెబుతున్నారు.

మూడు నెలలుగా ఇదే పరిస్థితి

ఉల్లిగడ్డల దిగుమతులు తక్కువగా ఉండటంతో పాటు మహారాష్ట్ర, కర్నూలు, డోను, నంద్యాల నుంచి దిగుమతులు రాకపోవడంతో గత మూడు నెలలుగా ఉల్లి ధరలు తగ్గకుండా ఒకే ధర మీద ఉన్నాయి. గత ఆగస్టు నెలలో మార్కాపురంలో కిలో ఉల్లిగడ్డలు రూ.40 ఉంటే నేడు కిలో రూ.65కు చేరుకున్నాయి. కనీసం ఒక్క రూపాయి కూడా తగ్గలేదు. పెరిగి పోతున్నాయే తప్ప తగ్గడం లేదని కొనుగోలు దారులు, వ్యాపారులు చెబుతున్నారు. ఆగస్టుకు ముందు పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేసుకునే వారు కూడా ఉల్లిగడ్డలు తక్కువకు ఇచ్చే పోయేవారు. నేడు వారు కూడా ఉల్లి ధరలు ఎక్కువగా ఉండటంతో వాటిని ఇవ్వడం మానేశారు. ఉల్లి దిగుమతులు రావడం తగ్గితే ధరలు పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ చెబుతున్నారు. రెండో రకం నాణ్యత లేకపోవడంతో కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇష్టపడటం లేదు.

కూరగాయలు అంతే...

కూరగాయల ధరలు కూడా రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వర్షాలు, అధిక వరదల కారణంగా పంటల దిగుబడి తగ్గడంతో కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. వ్యాపారులు కూడా అదను చూసి అమ్మకాలు సాగిస్తున్నారు. పట్టించుకునే వారు, అడిగేవారు లేరు లేకపోవడంతో వారు ఇష్టం వచ్చినట్లు అమ్మకాలు చేస్తున్నారు. మార్కాపురం మార్కెట్‌లో వ్యాపారికో ధర చెబుతున్నారు. టమోటాలు కిలో ప్రస్తుతం మొదటి నాణ్యతగా ఉన్నవి రూ.60 ఉంటే రెండో రకం టమోటాలు రూ.40 నుంచి రూ.45 వరకు ఉన్నాయి. క్యారెట్ కిలో రూ.60 నుంచి రూ.80 వరకు ఉంది. చిక్కుళ్లు కిలో రూ.80 నుంచి రూ.వంద వరకు ఉన్నాయి. ఇవే కాకుండా వంకాయ, కాకరకాయ, బీర, దొండ, బెండ, బంగాళ దుంప, సైతం కిలో రూ.45 నుంచి రూ.50 వరకు ఉన్నాయి. ఉల్లి ధరలు మాదిరిగానే కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.

తాళం వేసి ఉన్న దుకాణంలో చోరీ

కంభం, న్యూస్‌టుడే : తాళం వేసి ఉన్న ఎలక్ట్రికల్ పైపుల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేసి నగదును ఎత్తుకెళ్లారు. స్థానిక బస్టాండ్ నుంచి వై జంక్షన్ వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన బాలవెంకటరెడ్డికి చెందిన లలిత ఎలక్ట్రికల్, పైపుల దుకాణం ఉంది. మూడు రోజుల కిందట ఆయన షిర్డీకి వెళుతూ షాపు బాధ్యతలను అందులో పనిచేసే సయ్యద్ ఇబ్రహీం అప్పగించారు గురువారం రాత్రి ఇబ్రహీం షాపు మూసి వేసి ఇంటికెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుక వైపు నుంచి వచ్చి బిల్డింగ్ పైన ఉన్న మెట్ల తలుపులు పగులగొట్టి లోపలికి వచ్చి. మెట్ల మార్గంలో మరోచోట రంధ్రం వేసి లోపలికి చొరబడి టేబుల్ డెస్క్‌లోని రూ.50 వేల నగదును, సీసీ కెమెరాకు చెందిన హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లారు.. ఇబ్రహీం శుక్రవారం ఉదయం దుకాణానికి వచ్చి చూసి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు, క్లూస్ టీం సభ్యులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నారాయణ తెలిపారు.

సినిమా హాలు వద్ద ఘర్షణ.. ఒకరికి గాయాలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెంలో వెంకటేశ్వర హాల్లో ఉదయం దేవర సినిమా బెనిఫిట్ షోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అభిమానులు ఈలలు కేకలతో హాలు మోత మోగింది. కొందరు అభిమానులు హాలు గేట్లు వద్ద నిలబడి సినిమాను తిలకించారు. ఇంటర్ వెల్ సమయంలో యర్రగొండపాలేనికి చెందిన డాల్డా శ్రీను అనే వ్యక్తి గేటువద్ద ఉన్న వారితో లోపలకు వెళ్లాలని తొలగండని అన్నారు. దీంతో అక్కడ ఉన్న వారు దారి ఇవ్వలేదు. మాటా పెరిగి ఒకరినొకరు కొట్టుకునే స్థాయిలో ఘర్షణ పడ్డారు. దీంతో ఎవరో ఒక వ్యక్తి శ్రీను తలపై కర్రతో కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర రక్త గాయమైంది. వెంటనే వై.పాలెం ప్రభుత్వ వైద్యశాల్లో చేర్చారు. ఈ విషయంపై తనను గుర్తు తెలియని వ్యక్తి కొట్టారని పోలీస్ స్టేషన్‌లో శ్రీను ఫిర్యాదు చేశాడు.

స్వర్ణాంధ్రపై ప్రజాభిప్రాయ సేకరణ

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : రాచర్ల మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం స్వర్ణాంధ్ర 2047పై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుకుల పాఠశాల, జడ్పీ హైస్కూల్, స్పందన, పేట బడుల్లోని ఉపాధ్యాయులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, ఎంఈవోలు శివకోటేశ్వరరావు, గిరిధరశర్మ, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రాయశ్చితాభిషేకాలు

పొదిలి, న్యూస్‌టుడే: తితిదేలో లడ్డూ ప్రసాదానికి జరిగిన అపరాధానికి ప్రాయశ్చితంగా శుక్రవారం పొదిలిలో ఆర్యవైశ్యసంఘం, వాసవీక్లబ్స్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి కలశాలతో జలాన్ని తీసుకొచ్చారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకం, జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

స్వచ్ఛందంగా కాలువ పూడికతీత

త్రిపురాంతకం గ్రామీణం: మండలంలోని ముడివేముల మేజర్ కాలువ పూడిక తీత, కంప తొలగింపు పనులను రైతులు స్వచ్ఛందంగా చేపట్టారు. ముడివేముల మేజర్ కాలువ త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్‌లోకెల్లా ఎక్కువ పొలం విస్తీర్ణంతో పాటు నిడివి కూడా అధికంగా ఉంది. అతి పెద్ద మేజర్ కాలువ కావడంతో అయిదేళ్ల నుంచి ఎలాంటి నిర్వహణ చేపట్టకపోవడంతో పిచ్చి కంప అధికంగా పెరిగి పూడిక ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ పిచ్చి చెట్లు, పూడిక నీటి సరఫరాకు అడ్డుగా ఏర్పడటంతో నీరు దిగువకు సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో రైతు సంఘం నాయకులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మేజర్ కాలువలో కేజీ రహదారి నుంచి ప్రధాన కాలువ వరకు రెండు కిలోమీటర్ల మేర పిచ్చి కంప తొలగింపు, పూడిక తీత చేపట్టారు. డీఈఈ విజయలక్ష్మి, ఏఈఈ శివన్నారాయణ ఈ పనులను పర్యవేక్షించారు.


పూడికతీత పనులు పరిశీలిస్తున్న డీఈఈ విజయలక్ష్మి, రైతు సంఘం నాయకులు

రాష్ట్రస్థాయి హాకీ, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కొనకనమిట్ల: వెలిగొండ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మైనంపాడు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెలిగొండ విద్యార్థులు అండర్ 14, 17 హాకీ విభాగంలో సత్తా చాటారు. ఆదిత్య, సుశాంత్, శివ చైతన్య, రంగశివ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. ● ఈ నెల 24 నుంచి 27 వరకు మార్కాపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడల్లో మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.అభి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.


కొనకనమిట్ల : హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

29న టెట్ మోడల్ టెస్ట్

మార్కాపురం పట్టణం, బేస్తవారపేట: యూటీఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన మార్కాపురం పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో, బేస్తవారపేటలోని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో టెట్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.


పెద్దదోర్నాల: విజేతలతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

సత్తా చాటి.. జిల్లా స్థాయి పోటీలకు...

మార్కాపురం పట్టణం, మార్కాపురం, పెద్దదోర్నాల, పొదిలి, తర్లుపాడు, న్యూస్‌టుడే: మార్కాపురంలో నిర్వహించిన నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడల్లో పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాజశేఖర్, కాశింవలి, కొండయ్య, కౌశిక్, జయకృష్ణ, నారాయణ, సమీర్, మహేష్, ఉదయ్‌సింగ్‌లు హైజంప్, కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సాయి బాలాజీ పాఠశాలకు చెందిన పలువురు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం గమనార్హం. మండలంలోని దరిమడుగు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులైన బి.వెంకటేష్, నిఖిల్, జె.వెంకీ, ఎం.మోషే, కె.జాన్ హస్, చైతన్యలు అండర్ 14 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. అండర్-17 విభాగాల్లో బాలికలు నాగమల్లేశ్వరి, ప్రవల్లిక, నూర్జహాన్, టి.కమల ఎంపికైనట్లు చెప్పారు. యోగాలో నిఖిల్ తేజ, డి.నాగులు, టి.గణేష్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ● పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 31 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ నారాయణరెడ్డి తెలిపారు. ● మార్కాపురం నియోజకవర్గం నుంచి జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం పొదిలిలోని బాలుర ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ● స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో తర్లుపాడు మండలంలోని మీర్జాపేట జడ్పీహెచ్ విద్యార్థులు సత్తాచాటారు. నియోజకవర్గ, మండల స్థాయిల్లో నిర్వహించిన అండర్-14, అండర్-17 విభాగాల్లో అథ్లెటిక్స్, స్పోర్ట్స్‌లో ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


పొదిలి : ఉపాధ్యాయులు, పీడీలతో జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

పాఠశాలకు పుస్తకాల వితరణ

పొదిలి గ్రామీణం, కంభం:న్యూస్‌టుడే: కంచి కామకోటి పీఠం ద్వారా పొదిలి మండలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలకు ఆధ్యాత్మిక పుస్తకాలను శుక్రవారం ఎంఈవో శ్రీనివాసరెడ్డి అందజేశారు. *లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంభంఅర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం కాపీ రైటింగ్ పుస్తకాలు క్లబ్ కోశాధికారి శిరిగిరి వెంకట్రావు అందజేశారు.

పెద్దదోర్నాల: చిన్నదోర్నాల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో చింతల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి యాగ్నిక్ విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

పౌష్టికాహార లోపంతోనే అనారోగ్య సమస్యలు

తర్లుపాడు, న్యూస్‌టుడే: బలమైన పౌష్టికాహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయని మార్కాపురం ప్రాజెక్టు సీడీపీవో సుశీల తెలిపారు. తర్లుపాడులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోషకాహార వారోత్సవ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. పౌష్టిహాకారం తీసుకోవాలని సూచించారు.


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న సీడీపీవో సుశీల

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

దొనకొండ, న్యూస్‌టుడే:

సమస్య: దొనకొండ పంచాయతీలోని బాదాపు రంలో మంచి నీటి కోసం అల్లాడిపోతున్నాం. ట్యాంకర్లు ద్వారా నీరు సరఫరా చేస్తే సమస్య తీరుతుంది. – నారాయణ బాదాపురం

సమాధానం: పంచాయతీలకు నిధులు వచ్చిన వెంటనే డీబోర్ వేయిస్తాం. అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తాం. – డేవిడ్, పంచాయతీ కార్యదర్శి

తాళ్లూరు, న్యూస్‌టుడే:

సమస్య: తూర్పుగంగవరం-దర్శి ప్రధాన రహదారిలో బొద్దికూర్పాడు-దోసకాయలపాడు గ్రామాల మధ్యనున్న రహదారి మధ్యలో పెద్ద గొయ్యిలా ఏర్పడి ప్రమాదాలకు నెలవుగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించగలరు. – వెంకటేశ్వర్లు, తూర్పుగంగవరం.

సమాధానం : త్వరలో రహదారికి మరమ్మతులు చేయిస్తాం. – రవి, జేఈ, ఆర్‌.అండ్‌.బి.

టంగుటూరు, న్యూస్‌టుడే:

పొగాకు గరిష్ఠ ధర రూ.358

టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 908 బేళ్లు కొనుగోలు జరిగాయి. పంగులూరివారిపాలెం, నిడమానూరు గ్రామాలకు చెందిన రైతులు 1,262 బేళ్లను తీసుకురాగా.. 354 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.190లు పలికిందని వేలం కేంద్ర నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ● కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం 392 పొగాకు బేళ్లను తిరస్కరించి నట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు వేలం కేంద్రానికి 1,292 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకురాగా... అందులో 900 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.159, సరాసరి ధర రూ.274.81 పలికిందన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, నారపుశెట్టి పాపారావు, నాయకులు

కురిచేడు, న్యూస్‌టుడే: ఆంధ్రుల ఆరాధ్య దైవం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహంతోపాటు, ఆలవలపాడు గ్రామ మాజీ సర్పంచి రావి పెద్ద సుబ్బారావు విగ్రహాలను దర్శి తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావులు శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. రావి పెద్దసుబ్బారావు గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు సృష్టించడం అవసరం

కనిగిరి, న్యూస్‌టుడే: ఉద్యోగ మేళాలు యువతకు ఉపాధి వేదికలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నేటి యువతకు ఉద్యోగ అవకాశాలు సృష్టించడం చాలా అవసరమన్నారు. మేళాలో మొత్తం 20 కంపెనీలు పాల్గొన్నాయి. 464 మంది యువకులు హాజరు కాగా.. 188 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ, ఆర్డీవో పి.జాన్ ఇర్విన్,జడ్పీటీసీ రజనీకాంత్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్అబ్దుల్ గఫార్, కళాశాల ప్రిన్సిపల్ జె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

మెరుగైన వసతుల కల్పనకు కృషి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు గుత్తేదారును ఆదేశించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనుల నాణ్యతలో రాజీపడరాదని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీలు అంటగట్టి.. నట్టేట ముంచి..



మాధవరం వద్ద తోట ఏపుగా పెరిగినా సక్రమంగా కంకులు రాని మొక్కజొన్న

తాళ్లూరు, న్యూస్‌టుడే:

ఆరుగాలం శ్రమించే రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. వర్షాభావం, ప్రకృతి విపత్తులు, చీడ పురుగులు, తెగుళ్ల బెడద సరిపోదన్నట్లు నకిలీ విత్తనాలు వారిని నిలువునా ముంచుతున్నాయి. తాళ్లూరు మండలంలో తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం, మాధవరం, కొత్తపాలెం, తదితర గ్రామాల రైతులు గతంలో మొక్కజొన్న పంటకు మంచి లాభాలు రావడంతో ఈ ఏడాదీ విస్తారంగా సాగు చేపట్టారు. అధిక దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో వారందరూ తాళ్లూరులోని ఓ దుకాణంలో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశారు. తీరా అవి నాణ్యత లోపించడం.. కంకులు రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కొందరు అన్నదాతలు మండల వ్యవసాయాధికారి, కంపెనీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు.

మూడు క్వింటాళ్లు గగనమే..

మండలంలోని పలు గ్రామాల రైతులు సుమారు 1,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఎకరాకు రూ. 30 వేల పైగా పెట్టుబడులు పెట్టారు. మొత్తం నాలుగు కోట్ల వరకు సాగు ఖర్చు చేశారు. ఈ సాగు సరాసరిగా 30 క్వింటాళ్ల వంతున దిగుబడి వస్తుందని అన్నదాతలు భావించారు. కానీ నకిలీ విత్తనాల విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు. ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం గగనమేనని.. అవి పంట కోతకు అయ్యే కూలీ ఖర్చులకు సరిపోవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను నాశనం చేశారు...



నకిలీ విత్తనాలను అంటగట్టి రైతులను నట్టేట ముంచారు. తాళ్లూరులో పదెకరాల్లో రూ.మూడు లక్షలపైగా పెట్టుబడులు పెట్టి మొక్కజొన్న సాగు చేసిన అప్పులో ఊబి మునిగిపోయా. గతంలో లాభాలు రావడంతో ఇతర రైతులనూ ప్రోత్సహించా. ప్రస్తుతం పంట దెబ్బతినడంతో వారి నుంచి వచ్చే దూషణలను భరించలేకపోతున్నా.

కోట కోటిరెడ్డి, రైతు, తాళ్లూరు.

నష్ట పరిహారం చెల్లించాల్సిందే....



తాళ్లూరులోని విత్తనాల దుకాణం డీలరు వద్ద మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి మూడున్నర ఎకరాల్లో సాగు చేశా. సుమారు రూ.లక్షపైగా పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా పంటను కాపాడుకున్నా. తీరా విత్తనాల్లో తేడా వల్ల కంకులు రాలేదు. పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయా. దీనికి విత్తన డీలరు తోపాటు కంపెనీయే బాధ్యత వహించి పరిహారన్ని అందజేయాలి.

- శేషయ్య, రైతు, కొర్రపాటివారిపాలెం.

శాస్త్రవేత్తలతో పంటలను పరిశీలిస్తాం...



గుంటూరులోని లాంఫాం నుంచి శాస్త్రవేత్తలను పిలిపించి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలింప జేస్తాం. కంకులు ఎందుకు బాగా రాలేదన్న విషయమై విచారిస్తాం. విత్తనాలను తనిఖీ చేసినా తయారీ ఎందుకు ఇలా జరిగిందన్న విషయమై వెల్లడవుతోంది. విత్తనాల నాణ్యత లోపిస్తే సంబంధిత బాధ్యులపై చట్టపరంగా చర్యలు చేపడతాం.

శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

పంట కోతలకు కూడా రాని పరిస్థితి...



సాగు చేసిన పంటంతా దెబ్బతింది. మొక్కలు ఏపుగా పెరిగినా కంకులు రాలేదు. వచ్చిన వాటికీ సైతం విత్తనాలు సక్రమంగా లేవు. ప్రస్తుతం ఎకరాలో పంట కోతకు రూ.ఆయిదు వేల వరకు ఖర్చు అవుతోంది. కోత కోసినా రాబడులు వచ్చే దిగుబడి కోతల ఖర్చులకు సరిపోవు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలి. తమకు న్యాయం చేయాలి.

కోట కార్తీక్, రైతు, కొర్రపాటివారిపాలెం

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

వీసీపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో మండలంలో జరిగిన అసైన్డ్ భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన దస్త్రాలు కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక కలెక్టర్ వరకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని 101 సర్వే నంబర్లలో 202 ఎకరాలకు సంబంధించి లావాదేవీలు జరిగాయి. అందులో 43 లావాదేవీలు మాత్రమే అమ్మకాలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగతావి వారసత్వ బదిలీలు చేశారు. వీటికి సంబంధించి పెదఆలవలపాడులోని మున్నంగి బెంజి అనే రైతు నుంచి వివరాలు సేకరించినట్లు ప్రత్యేక కలెక్టర్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న ప్రత్యేక కలెక్టర్ వరకుమార్

సాగర్ జలాలు విడుదల చేయండి

టంగుటూరు, న్యూస్‌టుడే: మూసి వాగుకి నాగార్జున సాగర్ జలాలను విడుదల చేయాలంటూ రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఒంగోలులో నాగార్జున సాగర్ సూపరింటెండెంట్ మురళీ మోహన్‌ను కలిసి వినతి పత్రాన్ని శుక్రవారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రామతీర్థం రిజర్వాయర్ నుంచి సాగర్ జలాలతో నింపి అలుగు ద్వారా నిడమానూరు గ్రామం వద్ద మూసికి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని సూపరింటెండెంట్ చెప్పినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పరిటాల కోటేశ్వర రావు, పమిడి వెంకటరావు, మస్తాన్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ మురళీ మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

స్పందనకు వందనం

పంటల పరిశీలన

తాళ్లూరు, న్యూస్‌టుడే : విత్తనాల నాణ్యత లోపించడం కారణంగా పలు గ్రామాల రైతులు సాగు చేపట్టిన మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయమై ఈనాడులో శుక్రవారం 'పుట్టి ముంచిన మొక్కజొన్న' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఏవో స్పందించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులు గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు: కురిచేడు: పెద్దవరం గ్రామంలోని పశువుల మేత, పోరంబోకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. కొంతమంది వ్యక్తులు ఆ భూములను ఆక్రమణలు చేశారని సమాచారం రావటంతో తహసీల్దార్ రజనీకుమారి ఆ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ



దర్శి, హనుమంతునిపాడు, మర్రిపూడి, న్యూస్‌టుడే: దర్శి సబ్ డివిజన్ విద్యుత్తు ఈఈగా పొదిలి శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో ఈఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ● హనుమంతునిపాడు ఎంపీడీవోగా ఎం.రంగసుబ్బారావులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా కలిగిరి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ● మర్రిపూడి మండల విద్యుత్తు ఏఈగా ఎదురు సుబ్బారెడ్డి విధుల్లో చేరారు. గతంలో కురిచేడు ఏఈగా విధుల నిర్వహిస్తూ బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చారు. అలాగే మండలం వెలుగు ఏపీఎం గా ఎల్.కోటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు.

విద్యుత్తు తీగలు తెగిపడి గేదె మృతి

హనుమంతునిపాడు: మండలంలోని కోటకొండపాలెంలో విద్యుత్తు తీగలు తెగిపడి గేదె శుక్రవారం మృత్యువాత పడింది. కొండారెడ్డిపల్లి కాలనీకి చెందిన ఉప్పల లక్ష్మయ్య చెందిన గేదె మేత కోసం వెళ్లింది. ఈ క్రమంలో తెగిపడిన విద్యుత్తు తీగలు తగిలి గేదె సంఘటనా స్థలంలోనే మృతి చెందింది.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

కురిచేడు: ఏఎన్ఎం విధులు ఇక చేయలేమంటూ మండలంలోని ఏఎన్ఎంలు శుక్రవారం ఎంపీడీవో కుసుమకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. అటు సచివాలయ పనులు, ఇటు వైద్యాధికారి పరిధిలో ఆరోగ్య కార్యక్రమ పనులు ఆ రెండు పనులు ఒకేసారి చేయలేమని, నేటి నుండి విధుల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలని వారు ఆమెను కోరారు. మండలంలోని ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణకు చేయూత

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. పోతుల సుబ్బరత్నం జ్ఞాపకార్థంగా ఆమె కుమార్తె గోగినేని విజయలక్ష్మి భోజన నిర్వహణకు రూ.35 వేల నగదును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆమెను శాలువా కప్పి సత్కరించారు.

విద్యుత్తు ఉద్యోగుల ఆందోళన

కనిగిరి: కనిగిరి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ఆర్టిజన్ ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో విద్యుత్తు ఉద్యోగులు నిరసన తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఎవరైనా బదిలీ చేయాలంటే ఆయుదేళ్లు నిండి ఉండాలని, రెండేళ్ల నిబంధనలు నిర్వహించి స్వచ్ఛందంగా బదిలీ కోరుకుంటే చేయాలన్నారు. అనిల్‌కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

కనిగిరి, కురిచేడు, న్యూస్‌టుడే: కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. రెవెన్యూ, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ఎక్సైజ్, దేవాదాయశాఖ, మత్స్యశాఖ, ఆర్టీసీ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. 15 మంది ఎంపీటీసీ సభ్యులకు.. ఏడుగురే సమావేశానికి వచ్చారు. సగం మంది సర్పంచులు రాకపోవడం విశేషం. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి వస్తారని..కార్యక్రమాన్ని ఆలస్యంగా ప్రారంభించారు. అయితే ఇతర కార్యక్రమాల వల్ల ఆయన రాలేకపోయారు. అనంతరం ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ. కోట్లది రూపాయల నిధులు వెచ్చిస్తున్నారని.. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మడతల కస్తూరిరెడ్డి, ఎంఈవోలు సుబ్బారావు, ఈవోఆర్డీ అన్నపూర్ణ, ఉద్యాన శాఖాధికారిణి అంజలీభాయి, ఎంపీడీవో హనుమంతరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ● సమావేశానికి రానివారు.. సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారని మండలంలోని ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. కురిచేడు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను నేటికీ పరిష్కరించలేదని జడ్పీటీసీ సభ్యుడు వెంకటనారాయణ, గిరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి గైర్హాజరైన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కనిగిరి: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం, చిత్రంలో జడ్పీటీసీ సభ్యురాలు కస్తూరిరెడ్డి

సిద్ధాంతాల్లేని పార్టీలతో ప్రజలకు నష్టం

పామూరు, న్యూస్‌టుడే: సిద్ధాంతాలు, విలువలు లేని పార్టీలు మతాల పేరుతో లబ్ధిపొందేందుకు కొన్ని రాజకీయ పార్టీలు అసహనిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. పామూరులోని డీవీ మనోహర్ భవనంలో శుక్రవారం ఆ పార్టీ మండల స్థాయి నిర్వహించిన జిల్లా కార్యశాలను ఆయన ప్రారంభించారు. పరిపాలించడం ప్రజల దురదృష్టకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, మాజీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకయ్య, నాయకులు వెంకట్రావు, యాసిన్, శ్రీనివాసులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



కనిగిరి: కబడ్డీ ఆడుతున్న బాలికలు

కనిగిరి, టంగుటూరు, సింగరాయకొండ, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కంచర్ల వారిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ.. కనిగిరి అంటేనే క్రీడలకు ప్రసిద్ధి అన్నారు. క్రీడాకారులందరూ జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు నారాయణరెడ్డి, సుబ్బారావు, తెదేపా నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, కిశోర్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. ● జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై టంగుటూరు మండలం అలకూరపాడు జడ్పీ పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ● సింగరాయకొండ పాకల ఉన్నత పాఠశాల విద్యార్థులు 22 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

తక్కువ రకం పొగాకు.. తగిన గిట్టుబాటు

టంగుటూరు, న్యూస్‌టుడే:

■ నిత్యం 100 నుంచి 200 బేళ్లు వెనక్కి

విపణిలో మంచి గిరాకీ ఉన్న వాణిజ్య పంటల్లో పొగాకు ఒకటి. మంచి గిట్టుబాటు ధర లభిస్తుండడంతో గత కొన్నేళ్లుగా ఈ పంట సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. ఈ సంవత్సరమూ పంటను అన్నదాతలు భారీగానే సాగు చేశారు. చరిత్రలో ఎన్నడూ చూడని ధరలు ఈ ఏడాది లభించాయి. ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే.. మరోవైపు టంగుటూరు బోర్డు పరిధిలో పెద్దమొత్తంలో నో బిడ్ల పడుతున్నాయి. రైతులు క్యూర్ చేసిన పొగాకు రోజుల తరబడి గిట్టుబాటు కాక అవస్థలు పడుతున్నారు. లోగ్రేడ్ రకం పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

14 మిలియన్ల కిలో మేర విక్రయం..

టంగుటూరు మండలంలో 5,349 హెక్టార్లలో పొగాకు పంట సాగుకు అనుమతులు ఉండగా.. 7,147 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. బోర్డు పరిధిలో 2,864 మంది రైతులు.. 2,827 బ్యారెన్‌లు ఉన్నాయి. ఈ ఏడాది 10 మిలియన్ కిలోల పొగాకు విక్రయానికి అనుమతులు లభించగా.. 135 రోజులకు 14 మిలియన్ కిలోల పంటను విక్రయించారు. ఇంకా రైతుల వద్ద ఒక్క మిలియన్ కిలోల పంట ఉంది. మిగిలిన పంటను అక్టోబర్ మొదటి వారానికి పూర్తి చేయాలని బోర్డు అధికారులు ఆలోచన చేస్తున్నారు.

తక్కువ ధరకు కొనుగోలు చేయాలని..

ఈ ఏడాది రైతులకు అధిక మొత్తంలో పొగాకు పంట ఆదాయం తెచ్చి పెట్టింది. అత్యధిక ధర రూ. 366 పలకగా.. సరాసరి ధర రూ.278.75 వరకు పలికింది. మొదట్లో ధరలు బాగానే ఉన్నా ప్రస్తుతం ఎఫ్-9,ఎఫ్-8, బీఆర్ఎఫ్, మీడ్స్ వంటి బేళ్లను కొనుగోలు చేయడం లేదు. సరైన ధర ఇవ్వడం లేదని.. అతి తక్కువ ధరకు కొనుగోళ్లు చేసేందుకు కంపెనీలు ప్రతినిధులు ఆరాటం చూపుతున్నారని రైతులు చెబుతున్నారు. గతంలో ఇదే గ్రేడ్‌ను రూ.260 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం లేదని వారు వాపోతున్నారు. గత నెల రోజులుగా నాణ్యమైన పొగాకు ధరలు సైతం స్థిరంగా కొనసాగుతున్నాయి. అత్యధిక ధర రూ.358 పలుకుతుండగా.. కనిష్ఠ ధర రూ.190 పలుకుతోంది.




ధర గిట్టుబాటు కాకపోవడంతో ట్రాక్టర్లలో పొగాకు బేళ్లు వెనక్కి తీసుకెళ్తున్న రైతు


వ్యాపారులు ముందుకు రావడం లేదు

మొద్దుపచ్చ, నల్లబొగ్గ గ్రేడ్ పొగాకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. కొనుగోలు చేసిన తక్కువ ధరలను విక్రయిస్తున్నారు. వారు అడిగిన ధరకు విక్రయిస్తే రైతులు నష్టపోతారు. మున్ముందు వేలం ప్రక్రియలో మంచి ధరలకు విక్రయం చేయడం వీలు ఉన్నాం. – పొగాకు బోర్డు సూపరింటెండెంట్ అట్లూరి శ్రీనివాసరావు, టంగుటూరు

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ఏటి వాలుకు ఎదురు వెళితే!





నదుల ద్వారా వస్తువులను రవాణా చేసేటప్పుడు ప్రవాహాల వేగాలను అనుసరించి లాజిస్టిక్స్ ప్లాన్ చేస్తే ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించవచ్చు. ఏటి వాలుకు ఈత కొట్టినా, ప్రవాహానికి ఎదురువెళ్లినా ఎలాంటి ప్రభావం ఉంటుందో తెలుసుకోవాలంటే సాపేక్ష వేగాన్ని అర్థం చేసుకోవాలి. ఇలాంటి సందర్భాల్లో అంకగణితంలోని 'పడవలు-ప్రవాహాలు' పాఠం ఉపయోగపడుతుంది. నీటిలో కదలికలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఆ భావనలు సాయపడతాయి. అందులో పట్టు సాధించాలంటే అభ్యర్థులు వేగం, కాలం, దూరం మధ్య సంబంధంపై అవగాహన పెంచుకోవాలి. సరళరేఖ సమీకరణాలను సాధించడం, భిన్నాలు, దశాంశాలను ఉపయోగించడం నేర్చుకోవాలి.

పడవలు - ప్రవాహాలు

నిలకడ నీటిలో

మనిషి/పడవ వేగం = x కి.మీ./గం.

ప్రవాహ వేగం = y కి.మీ./గం.

ప్రవాహ దిశలో

మనిషి వేగం/పడవ వేగం (Down Stream – ఏటి వాలు) = (x + y) కి.మీ./గం.

ప్రవాహానికి వ్యతిరేక దిశలో

మనిషి వేగం/పడవ వేగం (Up Stream - ఏటికి ఎదురు) = (x – y) కి.మీ./గం.

∴ ఏటి వాలు = x + y
ఏటికి ఎదురు = x – y } (+) చేయగా

ఏటి వాలు + ఏటికి ఎదురు = 2x

$\therefore x = \dfrac{\text{ఏటి వాలు + ఏటికి ఎదురు}}{2}$

∴ ఏటి వాలు = x + y
ఏటికి ఎదురు = x – y } (–) చేయగా

ఏటి వాలు – ఏటికి ఎదురు = 2y

$\therefore y = \dfrac{\text{ఏటి వాలు – ఏటికి ఎదురు}}{2}$

మాదిరి ప్రశ్నలు

1. ఎ) ఏటి వాలులో 11 కి.మీ., ఎదురులో 5 కి.మీ. 1 గంటలో పడవ నడుస్తుంది. అయితే నిలకడ నీటిలో పడవ వేగం ఎంత?

1) 3　2) 5　3) 8　4) 9

వివరణ: ఏటి వాలులో = 11 కి.మీ./గం.

ఏటికి ఎదురుగా = 5 కి.మీ./గం.

నిలకడ నీటిలో పడవ వేగం (x) = $\dfrac{\text{ఏటి వాలులో + ఏటికి ఎదురు}}{2}$

$= \dfrac{11+5}{2} = \dfrac{16}{2} = 8$ కి.మీ./గం.　**జ: 3**

బి) ఒకడు ఏటి వాలులో 32 కి.మీ., ఏటికి ఎదురుగా 14 కి.మీ. పడవ నడిపాడు. ప్రతి వైపునకు 6 గంటలు తీసుకుంటే ప్రవాహ వేగం ఎంత? (కి.మీ./గం.లో)

1) $\frac{1}{2}$　2) 1　3) $1\frac{1}{2}$　4) 2

వివరణ: ఏటి వాలులో = $\left(\dfrac{32}{6}\right)$ కి.మీ./గం.

ఏటికి ఎదురుగా = $\left(\dfrac{14}{6}\right)$ కి.మీ./గం.

∴ ప్రవాహ వేగం (y) = $\dfrac{\text{ఏటి వాలులో – ఏటికి ఎదురుగా}}{2}$



$= \dfrac{\frac{32}{6} - \frac{14}{6}}{2}$

$= \dfrac{18}{6 \times 2} \Rightarrow \dfrac{3}{2} = 1.5$ కి.మీ./గం.

లేదా $1\frac{1}{2}$ కి.మీ./గం.　**జ: 3**

2. పడవ నడిపేవాడు ఏటికి ఎదురుగా 2 కి.మీ.కు గంట; ఏటికి వాలుగా 1 కి.మీ.కు 10 నిమిషాలు తీసుకుంటే, నిశ్చల నీటిలో 5 కి.మీ.లకు ఎంత సమయం తీసుకుంటాడు?

1) 40 నిమిషాలు　2) 1 గంట
3) 1 గం. 15 ని.　4) ఏదీకాదు

వివరణ: ఏటికి వాలుగా 1 కి.మీ.కు 10 నిమిషాలు తీసుకుంటే

ఏటి వాలులో = $\dfrac{1}{\frac{10}{60}} \Rightarrow \dfrac{60}{10} = 6$ కి.మీ./గం.

ఏటికి ఎదురుగా 2 కి.మీ.కు 1 గంట తీసుకుంటే

ఏటికి ఎదురుగా = $\dfrac{2}{1} \Rightarrow 2$ కి.మీ./గం.

∴ పడవ వేగం = $\dfrac{6+2}{2} = 4$ కి.మీ./గం.

కాలం (T) = $\dfrac{\text{దూరం}}{\text{వేగం}}$

$= \dfrac{5}{4}$ కి.మీ./గం. ⇒ = $1\frac{1}{4}$ గంటలు

∴ 1 గంట 15 నిమిషాలు　**జ: 3**

3. ఒక పడవ 13 కి.మీ./గం.తో నిశ్చల నీటిలో వెళ్లగలదు. ప్రవాహ వేగం 4 కి.మీ./గం. అయితే 68 కి.మీ. వాలులో వెళ్లడానికి ఎన్ని గంటలు పడుతుంది?

1) 2　2) 3　3) 4　4) 5

వివరణ: పడవ వేగం (x) = 13 కి.మీ./గం.

ప్రవాహ వేగం (y) = 4 కి.మీ./గం.

ఏటివాలుగా పడవ వేగం = 17 కి.మీ/గం.

ఏటివాలుగా ప్రయాణించిన దూరం = 68 కి.మీ.

కాలం = $\dfrac{\text{దూరం}}{\text{వేగం}} = \dfrac{68}{17}$

∴ కాలం = 4 గంటలు　**జ: 3**

4. ఒక వ్యక్తి పడవను కొంత దూరానికి ఏటి వాలులో నడిపే కాలానికి 3 రెట్లు ఎదురుగా నడిపేందుకు తీసుకుంటాడు. అయితే నిశ్చల నీటిలో పడవ వేగానికి, నీటి ప్రవాహ వేగానికి ఉన్న నిష్పత్తి ఎంత?

1) 2:1　2) 3:1　3) 3:2　4) 4:3

వివరణ: ఇచ్చిన లెక్క ప్రకారం

ఏటికి ఎదురుగా పడవ వేగం = x కి.మీ./గం.

ఏటి వాలుగా పడవ వేగం = 3x కి.మీ./గం.

x = $\dfrac{\text{ఏటికి ఎదురుగా + ఏటి వాలుగా}}{2}$

y = $\dfrac{\text{ఏటి వాలుగా – ఏటికి ఎదురుగా}}{2}$

x : y

$\Rightarrow \dfrac{x+3x}{2} : \dfrac{3x-x}{2}$

$\Rightarrow \dfrac{4x}{2} : \dfrac{2x}{2}$　∴ 2 : 1　**జ: 1**

జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

5. ఏటికి ఎదురుగా 42 నిమిషాల్లో 7 కి.మీ. ఒక పడవ నడుస్తుంది. ప్రవాహ వేగం 3 కి.మీ./గం. అయితే నిలకడ నీటిలో బోటు వేగం ఎంత (కి.మీ./గం.ల్లో)?

1) 4.2　2) 9　3) 13　4) 21

వివరణ: ఏటికి ఎదురుగా బోటు 42 నిమిషాల్లో 7 కి.మీ. ప్రయాణిస్తుంది.

ఏటికి ఎదురుగా = $\dfrac{D}{T} \Rightarrow \dfrac{7}{\frac{42}{60}}$

$\Rightarrow \dfrac{7 \times 60}{42} = 10$ కి.మీ./గం.

ప్రవాహ వేగం (y) = 3 కి.మీ.

నిలకడ నీటిలో బోటు వేగం

x = ఏటికి ఎదురుగా + y = 10 + 3

x = 13 కి.మీ./గం.　**జ: 3**

6. నిశ్చల నీటిలో పడవ వేగం 15 కి.మీ./గం. 30 కి.మీ. ప్రవాహ దిశలో కొంత దూరం వెళ్లి మళ్లీ తిరిగి రావడానికి 4 గం. 30 ని. సమయం పట్టింది. అయితే ప్రవాహ వేగం ఎంత?

1) 4 కి.మీ./గం.　2) 5 కి.మీ./గం.
3) 6 కి.మీ./గం.　4) 10 కి.మీ./గం.

వివరణ: ప్రవాహ వేగం = x కి.మీ./గం.

వాలులో వేగం = (15 + x) కి.మీ./గం.

ఎదురు వేగం = (15 – x) కి.మీ./గం.

$\therefore \dfrac{30}{15+x} + \dfrac{30}{15-x} = 4\dfrac{1}{2}$

$\Rightarrow \dfrac{30(15-x) + 30(15+x)}{(15+x)(15-x)} = \dfrac{9}{2}$

$\Rightarrow \dfrac{450 - 30x + 450 + 30x}{225 - x^2} = \dfrac{9}{2}$

$100(900) = 9(225 - x^2)$

$200 = 225 - x^2 \Rightarrow x^2 = 25$

x = 5 కి.మీ./గం.　**జ: 2**

7. ఏటి వాలులో కొంతదూరం పోవడానికి పడవకు ఒక గంట, తిరిగి రావడానికి $1\frac{1}{2}$ గంట పట్టింది. ప్రవాహ వేగం 3 కి.మీ./గం. అయితే, నిలకడ నీటిలో పడవ వేగం ఎంత?

1) 12 కి.మీ./గం.　2) 13 కి.మీ./గం.
3) 14 కి.మీ./గం.　4) 15 కి.మీ./గం.

వివరణ: నిలకడ నీటిలో పడవ వేగం = x కి.మీ./గం.

వాలులో వేగం = (x + 3) కి.మీ./గం.

వాలుకు ఎదురు వేగం = (x–3) కి.మీ./గం.

∴ ఏటి వాలులో కొంతదూరం పోవడానికి ఒక గంట, తిరిగి రావడానికి $1\frac{1}{2}$ గంట పట్టింది.

దూరం సమానం కాబట్టి

దూరం = వేగం × కాలం

$\text{వేగం}_1 \times \text{కాలం}_1 = \text{వేగం}_2 \times \text{కాలం}_2$

$(x + 3) \times 1 = (x - 3)\dfrac{3}{2}$

$2x + 6 = 3x - 9$

పడవ వేగం (x) = 15 కి.మీ./గం.　**జ: 4**

8. ఒక వ్యక్తి నిశ్చలనీటిలో 5 కి.మీ./గం. పడవ నడపగలడు. ప్రవాహం వేగం 1 కి.మీ./గం. ఒక ప్రదేశానికి వెళ్లి తిరిగి రావడానికి అతడికి పట్టే కాలం 1 గంట అయితే, ఆ ప్రదేశం ఎంత దూరంలో ఉంది?

1) 2.4 కి.మీ.　2) 2.5 కి.మీ.
3) 3 కి.మీ.　4) 3.6 కి.మీ.

వివరణ: పడవ వేగం (x) = 5 కి.మీ./గం.

ప్రవాహ వేగం (y) = 1 కి.మీ./గం.

ఏటి వాలులో వేగం = 5+1 = 6 కి.మీ./గం.

ఏటికి ఎదురుగా వేగం = 5 – 1 = 4 కి.మీ./గం.

కాలం (T) = $\dfrac{\text{దూరం}}{\text{వేగం}}$

∴ దూరం = D అనుకుంటే

$T = \dfrac{D}{6} + \dfrac{D}{4} = 1$ గంట $= \dfrac{2D + 3D}{12} = 1$

$\Rightarrow 5D = 12$

D (దూరం) = $\dfrac{12}{5}$

= 2.4 కి.మీ.　**జ: 1**



రచయిత: దొర కంచుమర్తి

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



✦ ఏ దేశ నూతన ప్రధానమంత్రిగా మహ్మద్ ఘాజీ జలాలి ఎన్నికయ్యారు?
జ: సిరియా

✦ న్యాయమూర్తుల నియామకం బదులు ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టిన తొలిదేశంగా ఏది నిలిచింది?　జ: మెక్సికో

✦ కుష్ఠు వ్యాధిని నిర్మూలించిన తొలిదేశంగా ఏ దేశాన్ని డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది?　జ: జోర్డాన్

✦ ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు సహాయంతో ఏ రాష్ట్రంలో 12 నగరాలకు తాగునీటి సదుపాయం కల్పించడానికి 'ముఖ్యమంత్రి నగర్ ఉన్నియాన్ ప్రకల్ప్ ప్రాజెక్ట్'ను ప్రారంభించారు?　జ: త్రిపుర

✦ పుణె విమానాశ్రయానికి కొత్త పేరు ఏమిటి?
జ: సంత్ తుకారం విమానాశ్రయం

✦ ఏ రాష్ట్రంలోని 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళలకు ఏటా రూ.10,000 ఇచ్చే 'సుభద్ర యోజన' పథకాన్ని 2024, సెప్టెంబరు 17న మోదీ ప్రారంభించారు?　జ: ఒడిశా

✦ ఏ దేశ శాస్త్రవేత్తల బృందం ఇటీవల 'మాల్' అనే కొత్త బ్లడ్ గ్రూపును కనిపెట్టింది?
జ: ఇంగ్లండ్

✦ ఇటీవల క్వాడ్ శిఖరాగ్ర సదస్సు అమెరికాలోని డెలావెర్‌లో జరిగింది. 2025లో ఈ సదస్సు ఏ దేశంలో జరుగుతుంది?　జ: ఇండియా

✦ ట్రామ్ (రెండు బోగీలతో రోడ్డుపై నడిచే రైలు బండి) రవాణా సదుపాయాన్ని కోల్‌కతాలో నిలిపి వేయనున్నట్లు ఆ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి స్నేహాశీష్ చక్రవర్తి ఇటీవల ప్రకటించారు. అయితే ట్రామ్ సర్వీస్ ఎప్పుడు ప్రారంభమైంది?　జ: 1873, ఫిబ్రవరి 24

✦ రైతులకు, చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించడానికి 'బానా కైహ్' (హ్యాండ్ హోల్డింగ్) పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం?
జ: మిజోరం

మరింత సమాచారం

ఏపీపీఎస్సీ జనరల్ స్టడీస్ చరిత్ర బౌద్ధమతం

డీఎస్సీ-2024 సైకాలజీ

పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఐదేళ్లలో గుజరాత్, ఆంధ్ర, ఒడిశాల్లో ఈ రంగంలో 3.7 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా



పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న నివేదితా శుక్లా

ఈనాడు, విశాఖపట్నం: గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో మూడు పెట్రోకెమికల్, పెట్రో ఇండస్ట్రియల్ రీజియన్ (పీసీపీఐఆర్)ల ద్వారా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 3.7 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా వెల్లడించారు. వికసిత్ భారత్‌లో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆ లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటించారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో కేంద్ర ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ఇండియా కెమ్-2024 ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో శుక్రవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో నివేదితా శుక్లా మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడిదారుల స్నేహపూర్వక వాతావరణం కనిపిస్తోంది. ఇక్కడ సువిశాల తీరప్రాంతం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉంది. కొత్త ప్రభుత్వం ఈ ఏడాది రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, 1.3 లక్షల మందికి ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఎక్కువ పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చేలా ఇండియా కెమ్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన, పెట్రో కెమికల్స్ రంగం చాలా కీలకమైంది. ప్రపంచ మార్కెట్‌లో మనం ఆరో స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం రసాయన మార్కెట్ విలువ సుమారు 220 బిలియన్ డాలర్లుగా ఉంది. 2040 నాటికి రూ.లక్ష కోట్ల రూపాయలకు పెరుగుతుంది' అని చెప్పారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఉపాధి అవకాశాల కోసం యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారి కోసం నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి వీలవుతుందన్నారు. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన వంద పార్కుల్లో మూడు మన రాష్ట్రానికి కేటాయించాలని, వాటిలో ఒకటి ప్రత్యేకంగా కెమికల్ పార్క్ ఉండేలా చూడాలని కోరారు. ఏపీలో పీసీపీఐఆర్ ఉన్నప్పటికీ భారీ పరిశ్రమలేవీ రాలేదని.. దీని గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఇటీవలే మాట్లాడారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 30 పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి దీపాంకర్ అరోన్, గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుదర్శన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో సమావేశమైన జిల్లా నేతలతోపాటు ఉన్న అనంతబాబు (వృత్తంలో)

కలిసికట్టుగా పని చేయండి

వైకాపా నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్

ఈనాడు, అమరావతి: 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం గట్టిగా నిలబడండి.. ఇందుకోసం ఎక్కువ సమయాన్ని కేటాయించండి.. జిల్లాలోని పార్టీ నేతలంతా ఒక కుటుంబంలా, కలిసికట్టుగా పనిచేయాలి' అని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 'ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలు, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల అధ్యక్షుల ఎంపికపై నేతలతో చర్చించారు. కాకినాడకు మాజీ మంత్రి కురసాల కన్నబాబునే కొనసాగించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికిచెందిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఇప్పటికే నియమించినందున.. కోనసీమ జిల్లాకు ఎస్సీ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని నేతలు సూచించినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్‌ను కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఖరారుచేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటీవలి ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసి ఓడిన రాపాక వరప్రసాదరావు గైర్హాజరయ్యారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రత్యక్షం: కాకినాడ, కోనసీమ జిల్లాల వైకాపా నేతలతో జగన్ నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవ్వటం చర్చనీయాంశంగా మారింది. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లిన ఆయన ఇప్పుడు బెయిల్‌పై బయట ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇప్పటికీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. కానీ అనంతబాబు మాత్రం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన చాలా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పుడు కూడా క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యక్షమవడం గమనార్హం.

రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం


చెన్నై నౌకాశ్రయంలో పట్టివేత

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయంలో రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి వారు తెలిపిన వివరాల మేరకు... చెన్నై నౌకాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు ఓడలో వెళ్లనున్న కంటెయినర్‌లో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అందులో 112 కిలోల సూడోఎఫెడ్రిన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. దీని రవాణాకు ఉపయోగించిన 2 లగ్జరీ కార్లతో పాటు రూ.3.9 లక్షలు స్వాధీనం చేసుకుని అబుతాహిర్, అహ్మద్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఇదే విధంగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాకు మత్తు పదార్థాలు తరలించారని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన విరమణ

- మంత్రి హామీలకు సానుకూలంగా నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాలను విరమించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లేఖను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్యవిద్యకు కేటాయించిన సీట్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు. సంఘం ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జీఓను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15% బదులు 20% సీట్లను అన్ని స్పెషాలిటీల్లో కేటాయిస్తామని తెలిపారు. సంఘంతో చర్చించిన తర్వాతే ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిని స్వాగతిస్తూ..



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ అందిస్తున్న వైద్య సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్ తదితరులు

సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్, ఇతర వైద్యులు కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17 నుంచి తాము విధుల్లో ఉన్నట్లు పరిగణించి వేతనాలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ట్రైబల్ ఎలవెన్సులు చెల్లించాలని అందులో కోరారు.

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

- 'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు

ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. సీఎంపై భూ ఆక్రమణల నియంత్రణ, అవినీతి నిరోధక, ఫోర్జరీ, బినామీ ఆస్తుల పరిరక్షణ, అధికార దుర్వినియోగం తదితర అభియోగాల కింద పలు సెక్షన్లు పెట్టారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'గోద్రా కేసులో ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ రాజీనామా చేశారా? అక్రమ గనుల తవ్వకాల కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి ప్రధాని రాజీనామా కోరారా?' అంటూ ప్రశ్నించారు. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

రాజీనామా చేయాల్సిన అవసరం లేదు: ఖర్గే

సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరంలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కేసు నమోదు చేయగానే సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటే.. గోద్రా కేసులో మోదీ రాజీనామా చేశారా? అమిత్ షా పైనా కేసులున్నాయి కదా? అని గుర్తు చేశారు. సీబీఐకి సాధారణ సమ్మతి ఉపసంహరణ చర్యనూ ఖర్గే సమర్థించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య



విజయం దక్కాలంటే..

విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ అప్పుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

అక్కడికి నేనొచ్చినట్లు ఎవరూ చెప్పలేదు

'ఈనాడు' కథనానికి సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ వివరణ

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టయిన రోజున తాను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చినట్లు ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. 'కస్టడీలో రఘురామకు చిత్రహింసలు నిజమే' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఓ ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. "ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు. అదే విషయం టెలికం సంస్థలూ చెప్పాయి. అలాంటిది నా లొకేషన్ ఎలా వచ్చింది? అది అబద్ధం. రఘురామకృష్ణరాజుకు గాయాల్లేవంటూ ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారు. వారు వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని ఒప్పుకొంటే వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుంది. రఘురామకు గాయాలు ఉన్నాయని, కొట్టడంవల్లే అవి అయ్యాయని మిలటరీ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారు, సాక్ష్యం చెప్పరు. అది ఆర్మీ యాక్టు వారికి కల్పించిన రక్షణ" అని సునీల్‌కుమార్ వివరించారు.

మార్చిలో ఇంటి నిర్మాణ సాయం పెంపు: మంత్రి కొలుసు

చాట్రాయి, న్యూస్‌టుడే: అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో త్వరలో స్థలాల కొనుగోలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా మర్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మార్చిలో గృహనిర్మాణ సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎంత పెంచాలనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సొంత స్థలం ఉన్న పేదలు వెంటనే గృహాలు నిర్మించుకునే అవకాశముందని పేర్కొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


ఎమ్మెల్యే బీఎన్‌కు సాయం అందజేస్తున్న ఎం.వేములపాడు తెదేపా నాయకులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎం.వేములపాడు తెదేపా నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో తెదేపా నాయకులు బీఎన్ విజయకుమార్ కలిసి నగదును అందజేశారు. తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు రూ.50వేలు, మాజీ సర్పంచి శీలం రామారావు రూ.50 వేలు, బూత్ కన్వీనర్లు పమిడి వెంకటేశ్వర్లు రూ.5వేలు, మలసాని నరసింహారావు, రూ.5,500లు, మలసాని శ్రీను, రూ.5వేలు, నీలం శ్రీరాములు రూ.5వేలు, మిట్నూతల వెంకట్రావు రూ.5వేలు, అరుంధతి కాలనీ వాసులు రూ.1,500లు అందజేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ అడ్డగడొట్టు బాలకోటయ్య పలువురు పాల్గొన్నారు.

42,033 కౌలు రైతు కార్డులు జారీ


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ అనుబంధశాఖలపై స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ-పంట నమోదు, ఈకేవైసీ వంద శాతం జరిగేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ కింద కౌలు రైతులకు 45 వేల కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా... ఇప్పటివరకు 42,033 కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారిణి బేబీరాణి, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ పాల్గొన్నారు.

పేద ఖైదీలకు సహాయం అందించాలి : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బెయిల్ వచ్చినా ష్యూరిటీ లేక ఇబ్బంది పడుతున్న పేద ఖైదీలకు ప్రభుత్వం తరుపున అవసరమైన సహాయం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. శుక్రవారం స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో జిల్లా ఎంపవర్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా జైలులోని ఖైదీల కేసులు స్థితిగతులు, బెయిల్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జి.దీనా, జిల్లా ప్రొబేషన్ అధికారి బాలప్రభాకర్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, జిల్లా జైలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

జీజీహెచ్‌కు అధునాతన పరికరం


యంత్రం పనితీరును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ దుర్గాదేవి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అత్యుత్తమ పద్ధతిలో వినికిడి లోపాన్ని గుర్తించే బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ ఆడియోమెట్రి పరికరం జీజీహెచ్‌లో అందుబాటులోకి వచ్చిందని వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం ఈ యంత్రం పనిచేసే విధానాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి, వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. సదరమ్ సర్టిఫికెట్లకోసం వచ్చే వారికి పరీక్ష చేయడానికి ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

రైతన్న చెంత.. సాంకేతికత అండ

● ఆదాయం పెంచే దిశగా అధికారుల సూచనలు
● అన్నదాతకు 'పొలం పిలుస్తోంది'తో కొత్త ఊపిరి

ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం, న్యూస్‌టుడే

- వ్యవసాయ డివిజన్: ఒంగోలు ● రైతు సేవా కేంద్రాలు: 125
- రైతులు : సుమారు 40 వేల మంది రైతులు
- పొలం విస్తీర్ణం: 65 వేల హెక్టార్లు
- సాగు చేసే పంటలు: పొగాకు, శనగ, మినుము, మిరప, వరి, కంది, సజ్జ, నువ్వులు


పేర్నమిట్టలో మిరప పంట సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయశాఖ పర్యవేక్షణలో వారంలో రెండు రోజులపాటు క్షేత్ర స్థాయిలో నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. రబీ సీజన్ ముగిసే వరకు నాలుగు నెలలపాటు పక్కాగా అమలు చేయాలని గ్రామ సచివాలయ, మండల, డివిజన్ స్థాయి అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. దీంతో వ్యవసాయ సిబ్బంది పొలం బాట పట్టాలని నిర్ణయించారు. తొలివిడతగా ఈ నెల 24, 25 తేదీల్లో కార్యక్రమాన్ని ప్రారంభించగా.. ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం మరో గ్రామంలో నిర్వహించేలా ప్రణాళిక చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మార్కెటింగ్, ఆత్మ, ప్రకృతి సేద్యం, డెయిరీ, మత్స్య సాగు విభాగాల అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తలు పంటల చెంతకు వెళ్లాల్సి ఉంటుంది. రైతుల ఆదాయాన్ని పెంచేలా పలు సూచనలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని గత వైకాపా ప్రభుత్వం ఊదరగొట్టడం ప్రచారమే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు యాజమాన్య పద్ధతులు- సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో అధికారులు, శాస్త్రవేత్తలు రైతుల వద్దకు వెళ్లి వారి సందేహాలు తీరుస్తారు. వారానికి రెండు రోజులపాటు నాలుగు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. రోజు సమావేశ నిర్వహణకు గాను రూ.2,300 చొప్పున కేటాయించారు. ఏ గ్రామంలో ఏ రోజు కార్యక్రమం నిర్వహించనున్నారో రైతులకు ముందస్తు సమాచారం ఇస్తున్నారు.

మంచి దిగుబడే లక్ష్యం



రాష్ట్ర వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తలు పొలం బాట పట్టి రైతులతో మమేకమై సాంకేతిక సేవలు అందిస్తున్నాం. సాగు ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడి పెంపే లక్ష్యంగా పనిచేస్తాం. నూతన విధానాలను రైతుల చెంతకు తీసుకెళ్లనున్నాం. తద్వారా రైతు ఆదాయాన్ని గణనీయంగా పెంచుతాం.

– బి.రమేష్‌బాబు, ఏడీఏ, ఒంగోలు


వంట గదిని ప్రారంభిస్తున్న జవహర్, బదరీనారాయణ తదితరులు

పూర్వ విద్యార్థి... అపూర్వ సాయం

చీమకుర్తి, న్యూస్‌టుడే: తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ. 5లక్షలు వెచ్చించి భోజనం వండేందుకు వంట గది నిర్మాణం చేయించి పెద్ద మనస్సు చాటుకున్నారు చీమకుర్తికి చెందిన విశ్రాంత ఆచార్యులు చలువాది వెంకటేశ్వరరావు సోదరులు. తమ తల్లి దండ్రులు చలువాది వెంకయ్య వెంకటరత్నం జ్ఞాపకార్థం నిర్మాణం చేయించిన ఈవంట గదిని వైద్యులు డాక్టర్ బి.జవహర్, పారిశ్రామిక వేత్త చలువాది బదరీనారాయణలు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఎస్ఎంపీ ఛైర్మన్ చలువాది రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విభాగినిని ఢీ కొట్టిన లారీ

మద్దిపాడు: మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్లాపల్లి ఫ్లైఓవర్ పై గురువారం అర్థరాత్రి స్పిరిట్ ట్యాంకర్ అదుపు తప్పి విభాగినిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవ్వరికి ప్రాణాపాయం లేక పోవడంతో గండం గడిచినట్లయింది. హైవే పోలీసులు ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో స్పిరిట్ ట్యాంకర్ ముందు బాగం నుజ్జు నుజ్జయింది.

తప్పిన ప్రమాదం : చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు కర్నూలు రహదారిలో చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం కూడలిలో శుక్రవారం తెల్లవారు జామున ఆర్టీసీ బస్సు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న సంఘటనలో ప్రమాదం తప్పింది. కనిగిరి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు నుంచి కనిగిరి వెళ్తుంది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

స్థలం కేటాయింపుపై ఎమ్మెల్యేకి వినతి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి నెహ్రూనగర్‌లో ప్రభుత్వ పింఛను దారుల సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు చేయాలని పింఛను దారుల సంఘం నాయకులు శుక్రవారం సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కమార్‌కి వినతి పత్రం అందజేశారు. చీమకుర్తిలో ఓ హోటల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసిన పింఛను దారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మర్రి లక్ష్మీనారాయణ, షేక్ అజాద్, ఉప్పుతోళ్ల నారాయణ, గోపి, రమణారెడ్డి, పుల్లయ్య, చల్లా శ్రీనివాసరావు తదితరులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. బాపట్ల నియోజకవర్గ ఉపాధ్యక్షులు మన్నం ప్రసాదరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై ఏవో వెంకట్రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డీటీ జయలక్ష్మి మాట్లాడుతూ. . సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్నారు. ఏవో మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సెక్షన్ 5(1) మేరకు పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలకు సంబంధించి బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'పై ర్యాలీ


నిడమానూరులో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి వెంకటప్పయ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో అవగాహన ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల క్రీడా మైదానంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, హెచ్ఎం కరీం సాహెబ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. ● మాచవరం ఉన్నత పాఠశాలలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శివరాం ప్రసాద్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు యాకోబ్, ప్రేమ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సీనియర్ కోఆర్డినేటర్ నియామకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సీనియర్ కోఆర్డినేటర్‌గా జూనియర్ ఛాంబర్ మాజీ జాతీయ అధ్యక్షులు నైనాల రామకృష్ణను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఛైర్మన్ పి.ప్రకాష్‌బాబు ఆయనకు నియామక పత్రం అందజేశారు. రామకృష్ణ గతంలో రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యునిగా వ్యవహరించారు. కొత్త బ్లడ్‌బ్యాంకు ప్రారంభం కానున్నందున రక్తదాన శిబిరాల నిర్వహణ, దాతలను ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలు చేపడతారని ఛైర్మన్ తెలిపారు.

రోడ్డు, రైల్వే మార్గాలకు సత్వరం భూ సేకరణ


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో నుంచి వెళ్తున్న జాతీయ రహదారులు, ప్రతిపాదిత రైల్వే మార్గాలకు పెండింగ్ భూ సేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియపై స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం, 565(డీ), 544(జీ), 216, 765, 167(బీ) జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఉపకలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.

● **తోట సుధాకర్‌కు నివాళి :** ఏపీఆర్ఎస్ఏ నాయకులు తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఆయన విగ్రహానికి శుక్రవారం సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్.కృష్ణమోహన్, కె.కాశయ్య పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఒంగోలు సబ్ రిజిస్ట్రార్లు : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు-1 సబ్ రిజిస్ట్రార్‌గా కె.శ్రీనివాసరావు, ఒంగోలు-2 సబ్ రిజిస్ట్రార్‌గా కె.రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు చిలకలూరిపేట, రాంబాబు కావలి నుంచి బదిలీపై ఒంగోలు వచ్చారు. ఇప్పటివరకు విధుల్లో కొనసాగిన సబ్ రిజిస్ట్రార్ ఒంగోలు-1 శ్రీనివాసరావు సంతనూతలపాడు; ఒంగోలు-2 వాసు దేవరెడ్డి కనిగిరి బదిలీ అయ్యారు.



మద్దిపాడు ఎంపీడీవోగా జ్యోతి : మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు ఎంపీడీవోగా వల్లపనేని జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా అల్లూరుకు ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న శ్రీనివాసరావు బదిలీ పై మార్టూరు వెళ్లారు.

నాగులుప్పలపాడు ఎంపీడీవోగా మహాలక్ష్మి : నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు ఎంపీడీవోగా మహాలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా రెంటచింతల నుంచి ఆమె బదిలీపై ఇక్కడు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జయమణి సింగరాయకొండకు బదిలీపై వెళ్లారు.

ఒంగోలు విద్యుత్తుశాఖ ఈఈగా హరిబాబు : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ ఒంగోలు ఈఈగా ఎం.హరిబాబు స్థానిక రామనగర్‌లోని విద్యుత్తు భవన్‌లో శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. ఆయన కనిగిరి ఈఈగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఈఈగా కొనసాగిన పి.శ్రీనివాసులు దర్శి ఈఈగా బదిలీ అయ్యారు.

చీమకుర్తి విద్యుత్తు ఏఈగా చంద్రశేఖర్ : చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి విద్యుత్తు ఉపకేంద్రం ఏఈగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన బదిలీపై టంగుటూరు నుంచి చీమకుర్తికి వచ్చారు.

ఏపీఎంగా కాకుమాను సుబ్బారావు : మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు మండల డీఆర్‌డీఏ - వెలుగు నూతన ఏపీఎంగా కాకుమాను సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నందివాడ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా ఎం.మురళీబాబు : చీమకుర్తి, న్యూస్‌టుడే: గెలాక్సీపురి సబ్‌రిజిస్ట్రార్‌గా ఎం.మురళీబాబు విధుల్లో చేరారు. తిరుపతి జిల్లా గూడూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీనియర్ సహాయకురాలుగా శోభ, జూనియర్ సహాయకులుగా అరుణ కుమారి, షరాబుగా నాగ శిరోమణి, సహాయకునిగా వెంకట రత్నం విధుల్లో చేరారు. ● **సంతనూతలపాడు:** మండల సబ్ సబ్‌రిజిస్ట్రార్‌గా సీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంతనూతలపాడులో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న షేక్ ఇస్మాయిల్ మార్టూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సింగరాయకొండలో పనిచేస్తున్న శ్రీనివాసరావు సంతనూతలపాడుకు బదిలీ అయ్యారు. అదే క్రమంలో కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న కె.భారతి ఒంగోలుకు బదిలీ కాగా, ఆమె స్థానంలో పొదిలిలో పనిచేస్తున్న ఎం.రామకృష్ణ సంతనూతలపాడుకు బదిలీ అయ్యారు.

● మండల వెలుగు ఏపీఎంగా బాబూరావు బాధ్యతలు స్వీకరించారు. మర్రిపూడి మండలంలో పనిచేస్తున్న బాబూరావు సంతనూతలపాడుకు బదిలీ అయ్యారు.

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే:



సమస్య: ఈదుమూడి ఎస్సీ కాలనీలో విద్యుత్తు సరఫరా అయ్యే విద్యుత్తు తీగలను స్తంభానికి ఇరువైపులా సపోర్టుగా ఉన్న ఇనుప రాడ్డు పూర్తిగా దెబ్బ తింది. దీంతో రాడ్డు పూర్తిగా విరిగిపోతే విద్యుత్తు తీగలు జారి పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– గరటయ్య, గ్రామస్థుడు

సమాధానం: సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తాం.

–రమేష్, ఇన్‌ఛార్జి ఏఈ

అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

సమస్య: నగరంలోని బలరాం కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళలో నిద్ర ఉండటంలేదు. ఫాగింగ్, కాలువలపై బ్లీచింగ్ కొట్టించాలని కోరుకుంటున్నాము.

– సుబ్బారావు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

– పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్


సమస్య: నగరంలోని శ్రీనివాస థియేటర్ వెనుక వీధిలో(గోపాల్‌నగర్) మురుగు కాలువలు శుభ్రం చేయక దుర్వాసన వస్తుంది. శుభ్రం చేయించవలసిందిగా కోరుతున్నాం.

– స్థానికుడు వెంకటరావు

సమాధానం: సిబ్బందిని పంపించి వెంటనే కాలువలు శుభ్రం చేయిస్తాం.

– పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

మద్దిపాడు, న్యూస్‌టుడే:



సమస్య: మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో ఒంగోలు వైపు వెళ్ళే దారిలో వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమల సంచారం కూడా పెరిగింది. చెత్తను అక్కడి నుంచి తొలగించగలరు. – ఎం. సతీష్ గుండ్లాపల్లి

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి తక్షణమే వ్యర్థాలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

–లతీఫ్ కార్యదర్శి గుండ్లాపల్లి

రగ్బీ- పెంటాథ్లాన్ జట్టు ఎంపిక


ఎంపికైన జట్టుతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రగ్బీ, మోడరన్ పెంటాథ్లాన్ అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి బాలుర జట్టు ఎంపిక పూర్తయింది. శుక్రవారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా కార్యదర్శి చింపారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. రగ్బీ బాలుర జట్టుకు స్టీఫెన్, జి.కుమార్, దేవేంద్రనాయక్, యు.తేజ, పుల్లారావు, విశ్వవర్ధన్‌రెడ్డి, యువతేజ, యువరాజు, వెంకట్, హుస్సేన్‌బాషా, జాన్‌పాల్, అభిలాష్‌లు ఎంపికైనట్లు ప్రకటించారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై సదస్సు

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయం వైపు మహిళలు దృష్టి సారించాలని జడ్‌బీఎన్ఎఫ్ అదనపు డీపీఎం సత్యనారాయణ సూచించారు. శుక్రవారం కొత్తపట్నంలోని మండల డీఆర్డీఏ కార్యాలయంలో మండల సమాఖ్య సభ్యులకు రెండు రోజులపాటు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించనున్న శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు, తెగుళ్లను నివారించవచ్చని వివరించారు. సమావేశంలో మండల ఏపీఎం విజయకుమారి, సీసీలు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక సిండికేటు రైతు సహకార సొసైటీ కార్యాలయం ముందు సైడు కాలువల నిర్మాణాలు జరిగేలా చూడాలని సొసైటీ రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిలిచిన సైడు కాలువల పనుల వద్ద నిరసన తెలిపారు. అధికారులు స్పందించి కాలువల నిర్మాణాలను పూర్తి చేసి తమకు ఎరువులు తీసుకొనేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

అయిదేళ్ల నిర్లక్ష్యం... గుంతలమయం

సంతనూతలపాడు, చీమకుర్తి, న్యూస్‌టుడే

గత అయిదేళ్ల వైకాపా ప్రభుత్వ పాలనలో రహదారులు నరకదారుల్లా తయారయ్యాయి. కనీస మరమ్మతులు లేక అధ్వానంగా మారాయి. నిత్యం వేలాదిమంది ప్రయాణించే రహదారుల నిర్వహణ గాలికొదిలేశారు. ఎంతో మంది గాయాలపాలవుతున్నా.. మృత్యువాత పడుతున్నా వాటిని పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. దీంతో అయిదేళ్లుగా ప్రజలు నరకయాతన అనుభవించారు. కొండపి, సంతనూతలపాడు మండలాల నుంచి ఒంగోలు పోయే ఎన్నెస్పీ రహదారిలో రోజూ వందలాది వాహనాల ప్రయాణిస్తూ ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన రోడ్డు గత అయిదేళ్లుగా గుంతలతో దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన వానలకు బురదమయంగా మారి


చీమకుర్తి మండలం యల్లయ్య నగర్ పెట్రోలు బంకుల వద్ద ఒంగోలు కర్నూలు రహదారి దుస్థితి

◆ **బురదతో నిండిన రహదారులు**

వాహనాలు కూరుకుపోయే పరిస్థితి ఏర్పడింది. చంద్రపాలెం-మంగమూరు మధ్య సుమారు కిలోమీటరు ఎన్నెస్పీ రహదారి ఉంది. కొండపి, అనకర్లపూడి, మద్దులూరు, చిలకపాడు, గంగవరం, చంద్రపాలెం తదితర గ్రామాలకు ఈ రోడ్డు మీద నుంచే ప్రయాణించాల్సి ఉంది. ఇంతటి ప్రాముఖ్యం గల రోడ్డు బురదమయంగా మారడంతో ప్రయాణికుల నరకయాతన పడుతున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు.

● చీమకుర్తి మండలంలోని ఒంగోలు కర్నూలు రహదారి గ్రానైట్ క్వారీలు, కంకర మిల్లుల ప్రాంతంలో రహదారి పరిస్థితి నానాటికీ అధ్వానంగా మారుతోంది. కొద్ది రోజుల క్రితం గోతుల మయంగా


చంద్రపాలెం ఎన్నెస్పీ కాలువపై బురద మయంగా మారిన రహదారి

ఉన్న రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. చీమకుర్తి పడమర వైపు శివారు పెట్రోలు బంకుల ప్రాంతం నుంచి మర్రిచెర్లపాలెం ముసి నది వరకు ఒంగోలు కర్నూలు రహదారి గోతులతో ప్రయాణికులకు నరకయాతన అనుభవిస్తున్నారు. పశ్చిమ ప్రకాశం, రాయలసీమ జిల్లాలకు ముఖ ద్వారంగా ఉన్న ఇంతటి ప్రధాన రహదారి ఈ రీతిలో అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గోతుల అధికారులు ప్రజా ప్రతినిధులు ఈ దారిల్లోనే వెళ్తున్నా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల ఈ రహదారి సందర్శనకు వచ్చిన కలెక్టర్ ఈ రోడ్డు పరిస్థితి చూసి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకూ మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి రాకతో నిధుల కేటాయింపు

గత అయిదేళ్లుగా రహదారుల నిర్వహణలేక నరకయాతన చూసిన ప్రయాణికులు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్ల పరిస్థితి మారతాయని ఆశించారు. అందుకు అణుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.